TGTEL/25/A0827

# ప్రజా దివాస్

తెలుగు దినపత్రిక

prajadivvs57@gmail.com

సంపుటి : 3 సంచిక : 203 | గురువారం 16-07-2026 | ఎడిటర్: ఎస్ ఎన్ డి మౌనిక రవికుమార్ | పేజీలు : 8 వెల 3 /-



విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా.. ? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా ... ? అయితే రండి ... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9440060406

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టల్‌లు కావలెను...


# ప్రభుత్వ పాఠశాలల్లోనే భవిష్యత్

## స్కూళ్లను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది



- ఇక్కడ చదివితేనే మెరుగైన భవిష్యత్
- సిఎం కావచ్చనడానికి నేనే ఉదాహరణ
- కొత్తకోటలో బాలికల హైస్కూల్ భవనాలకు ప్రారంభం
- క్రీడల్లో అయినా రాణించాలని సిఎం రేవంత్ హితవు

గత ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు లేకపోవడంతో విద్యార్థులు చేరలేదని.. ఎక్కువ మంది ప్రైవేటుకు వెళ్లారన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేకంగా దృష్టి సారించామని రేవంత్ చెప్పారు. వనపర్తి జిల్లా కొత్తకోటలో బాలికల హైస్కూల్ భవనాలను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ఒక్కో విద్యార్థినిపై రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రూ. 1.08లక్షలు ఖర్చు చేస్తోంది. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలి. చదువుల్లో రాణించకపోతే క్రీడల్లో రాణించాలి. క్రీడాకారులు మహ్మద్ సిరాజ్, నిఖత్ జరీన్‌కు గ్రూప్-1 ఉద్యోగాలు ఇచ్చాం. గ్రామీణ ప్రాంతాల్లో మట్టిలోని మాణిక్యాలను వెలికితీయాలి. విద్యార్థులు మైదానాల్లోనూ పోటీపడాలి. మీ భవిష్యత్తుకు నాదీ హామీ. క్రీడల్లో రాణించేవారిని ఉన్నతస్థాయిలో నిలిపే బాధ్యతను ఈ ప్రభుత్వం తీసుకుంటుంది. ఈ ప్రాంతంతో నాకు ప్రత్యేక అనుబంధం ఉంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్యలకు పరిష్కారం చూపుతాం అని రేవంత్ అన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో చదివితే ముఖ్యమంత్రి అవ్వచ్చని... అందుకు తానే ఉదాహరణ అని అన్నారు. తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రభుత్వ స్కూళ్ళు కీలక పాత్ర పోషించాయని... చదివితే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అన్నారు సీఎం రేవంత్. మొన్న గోల్డ్ మెడల్ సాధించిన ఈషా సింగ్ కు రూ.3 కోట్లు ఇచ్చామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉందని అన్నారు. 26వేల ప్రభుత్వ స్కూళ్లలో 18 లక్షల మంది విద్యార్థులు ఉన్నారని..ప్రైవేట్ లో 11 వేల స్కూళ్ళు ఉంటే...33 లక్షల మంది విద్యార్థులు ఉన్నారని అన్నారు సీఎం రేవంత్. ప్రభుత్వ స్కూళ్ల టీచర్ల అర్హతతో సగం కూడా ప్రైవేట్ టీచర్లకు లేదని.. ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక సదుపాయాలు లేక జనం ప్రైవేట్ బాట పడుతున్నారని అన్నారు సీఎం రేవంత్. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ స్కూళ్ళు పునరుద్ధరిస్తున్నామని... ప్రభుత్వ స్కూళ్లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.





## సమ్మిళిత పట్టణాభివృద్ధిపై ఏపీ ప్రభుత్వం, యూఎన్ హ్యాబిటాట్ ఒప్పందం

- రాష్ట్రంలో సమ్మిళిత పట్టణాభివృద్ధికి సరికొత్త వ్యూహాత్మక అడుగు
- అమరావతిలో పట్టణ వ్యవహారాలపై సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ఏర్పాటు
- పేదరిక నిర్మూలన మరియు పేదల జీవనోపాధి మెరుగుకు ప్రాధాన్యం
- రాజధాని నిర్మాణంలో ప్రపంచ అత్యుత్తమ విధానాల అమలు
- సుస్థిర పర్యావరణ వ్యవస్థలు మరియు డిజిటల్ గవర్నెన్స్ పై ఉమ్మడి కృషి



## ఆర్థికాభివృద్ధి కేంద్రంగా రాజధాని అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

- రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కేంద్ర బిందువుగా ప్రపంచ స్థాయి నగరం
- అమరావతి 2.0 ఇంటిగ్రేటెడ్ మాస్టర్ ప్లాన్ పనులపై సమీక్ష
- ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా రాజధాని ఆర్థిక వ్యవస్థ బలోపేతం
- ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్లతో అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు
- పర్యావరణ పరిరక్షణ కోసం గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ బిల్డింగ్ విధానాలు

## జగన్ రెడ్డి నేరపూరిత వైఖరిపై వర్ల రామయ్య తీవ్ర ధ్వజం

- రాజకీయ వ్యవస్థను జగన్ పూర్తిగా కలుషితం చేశారు
- నేరగాళ్లు మరియు రౌడీ షీటర్లకు వైకాపా బహిరంగ మద్దతు
- గత ప్రభుత్వ హయాంలో శాసనసభ కౌరవ సభగా మారింది
- అమాయక బాధితులను వదిలి ముద్దాయిలకు జగన్ వత్తాసు
- కూటమి ప్రభుత్వంలో చట్టం తన పని తాను చేసుకుపోతుంది



2లో

## మేడిగడ్డపై కేంద్రం తీరు దారుణం



- ఎన్‌డిఎస్‌ఎ రిపోర్టుపై మండిపాటు
- పోలవరం విషయంలో ఒకలా..ఇక్కడ మరోలా
- రాష్ట్ర ఇంజనీర్ల నివేదికను బహిర్గతం చేయాలి
- సిసిఐని తెరిపించాలని కేంద్ర మంత్రికి వినతి
- ఢిల్లీలో మీడియాతో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్

2లో

# షాబాద్ ఘటనలో నిందితుడికి బెయిల్..

## పోలీసుల వైఫల్యమే: రేవంత్‌కు పవన్ లేఖ



- సీఎం రేవంత్‌రెడ్డికి పవన్‌కల్యాణ్ లేఖ.
- పోక్సో చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని విజ్ఞప్తి.
- షాబాద్ ఘటనను లేఖలో ప్రస్తావించిన పవన్.
- బాధితులను కాపాడటంలో పోలీసులు విఫలమయ్యారని విమర్శ.
- పోక్సో కేసు ఉన్నా నిందితుడికి బెయిల్ రావడం వైఫల్యమని వ్యాఖ్య.
- పోక్సో కేసుల విచారణకు నిర్దిష్ట గడువు కోరారు.
- బాధితుల రక్షణకు ప్రత్యేక చర్యలు

అమరావతి: తెలంగాణలో పోక్సో చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కోరారు. ఈ మేరకు ఆయనకు లేఖ రాశారు. షాబాద్ హత్యల ఘటనను ఈ సందర్భంగా పవన్ ప్రస్తావించారు. పోక్సో కేసులో విచారణకు నిర్ణీత గడువు విధించాలని.. బాధితుల రక్షణకు చర్యలు తీసుకోవాలని పవన్ కోరారు. సాక్ష్యాధారాలు మాయం చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. "షాబాద్ కేసులో బాధితులను కాపాడటంలో పోలీసులు విఫలమయ్యారు. పోక్సో కేసు ఉన్నా నిందితుడికి బెయిల్ ఇవ్వడం వైఫల్యమే. ఈ ఘటనలో పోలీసులు తగిన జాగ్రత్తలు తీసుకోలేదు. పోక్సో కేసులకు ప్రాధాన్యం ఇవ్వాలని సుప్రీంకోర్టు అనేకసార్లు చెప్పింది" అని పవన్ పేర్కొన్నారు.

# కెసిఆర్‌ది ఫామ్‌హౌజ్ పాలన

## కెటిఆర్ విమర్శలపై మండిపడ్డ పొంగులేటి



ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పందించారు. కేసీఆర్ పదేళ్ల పాలనను 'ఫాంహౌస్ పాలన'గా ఆయన అభివర్ణించారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని వినియోగించు కోకుండా ఫాంహౌస్‌కే ఆయన పరిమితమయ్యారని విమర్శించారు. ప్రభుత్వ వ్యవస్థలను నిర్వీర్యం చేసి పలు రంగాల్లో వైఫల్యాలకు కారణమయ్యారని పొంగులేటి ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లోకి వెళ్లి పాలన అందిస్తోందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రజల కోసం పనిచేసే నాయకత్వంతోనే సుపరిపాలన సాధ్యమవుతుందని పొంగులేటి పేర్కొన్నారు.

## తుంగతుర్తి అంశంలో జోక్యం చేసుకోను: మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్: తుంగతుర్తిలో నెలకొన్న వివాదాన్ని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి చూసుకుంటారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ విషయంలో తాను జోక్యం చేసుకోబోనని స్పష్టం చేశారు. బంజారాహిల్స్‌లోని కోమటిరెడ్డి నివాసంలో ఆయనతో జగ్గారెడ్డి భేటీ అయ్యారు. తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ మండల అధ్యక్ష పదవుల విషయంలో నెలకొన్న వివాదంపై చర్చించారు. కోమటిరెడ్డితో భేటీ అనంతరం జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడారు. తుంగతుర్తి అంశంలో కలగజేసుకునేందుకు కోమటిరెడ్డి ఆసక్తి చూపించడం లేదన్నారు.

# సంపాదకీయం

## న్యాయ వ్యవస్థ స్వతంత్రత కోల్పోతున్నదా?

ఒక తండ్రి తన అయిదేళ్ల కుమారుడిని స్కూలుకు తీసుకువెళుతుండగా, ఒక ట్యాంకర్ వెనుకనుంచి వచ్చి ఢీకొనడంతో ఆ బాలుడు మరణించాడు. ఆ రోడ్డుకు ఫుట్‌పాత్ కానీ, రోడ్డు దాటేందుకు క్రాసింగ్ గుర్తులు కానీ లేవు. దేశంలో ఇలాంటి ఘటనలు పెద్ద సంఖ్యలో జరుగుతూనే ఉంటాయి కానీ ఉన్నత న్యాయస్థానం మాత్రం ఈ విషాద ఘటనపై అరుదైన రీతిలో స్పందించింది. నడిచి వెళ్లడం అనేది ఆర్టికల్ 19(1)(డి), ఆర్టికల్ 21 క్రింద ప్రాథమిక హక్కులుగా గుర్తించాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ ఆదేశాలు జారీ చేశారు. రహదారులను వాహనాల కోసమే కాకుండా పాదచారులకు అనువైన విధంగా నిర్మించాలని ఆయన చెప్పారు. భారతదేశంలో నడిచి వెళ్లడం అనేదానికి సాంస్కృతిక, మతపరమైన, రాజకీయ, సామాజిక విలువ ఉన్నదని కూడా ఆయన గుర్తు చేశారు. దండి యాత్ర, భూదానోద్యమం లాంటి చారిత్రక ఘటనలను జస్టిస్ నరసింహ ఉదహరించారు.

నడిచి వెళ్లడమే ఒక ఘర్షణగా మారిన ఈ దేశంలో ఏటా సగటున 36,500 మంది పాదచారులు సరైన ఫుట్‌పాత్‌లు, క్రాసింగ్‌లు లేక మరణిస్తున్నారని ఒక అధ్యయనం వెల్లడించింది. 80శాతం పట్టణ రోడ్లలో సురక్షితమైన, నడిచివెళ్లే వారికి అనువైన మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్ల ఈ ఘటనలు జరుగుతున్నాయి. మెట్రో నగరాల్లో 44శాతం రోడ్లకు అసలు ఫుట్‌పాత్‌లే లేవు. ఉన్న ఫుట్‌పాత్‌లలో అత్యధికం ఇండియన్ రోడ్ కాంగ్రెస్ విధించిన నిబంధనలకు అనుగుణంగా లేవు. వికసిత్ భారత్, ట్రిలియన్ ఎకానమీ, విశ్వనగరాల గురించి మాట్లాడే ప్రభుత్వ పెద్దలకు దేశంలో నడిచివెళ్లే వారి దుస్థితి గురించి ఎంతవరకు తెలుసు? ప్రజల ప్రాథమిక హక్కులకు అనుగుణంగా చట్టాలు చేయకపోవడాన్ని ఈ సందర్భంగా జస్టిస్ నరసింహ ప్రశ్నించారు. మోటారు వాహనాల చట్టం చేసినప్పుడు నడిచి వెళ్లే ప్రజల ప్రాథమిక హక్కును గుర్తించలేదని, ఈ చట్టం కేవలం వాహనాల కోసమే చేసినట్లున్నదని ఆయన స్పష్టం చేశారు. వచ్చే ఏడాది ప్రధాన న్యాయమూర్తి కానున్న రెండో తెలుగువాడైన జస్టిస్ పీఎస్ నరసింహ నడకను ప్రాథమిక హక్కుగా గుర్తించాలని తీర్పు ఇచ్చిన తర్వాత ప్రజల నుంచి విపరీతమైన ప్రతిస్పందన వచ్చింది. అనేక నగరాల్లో ఫుట్‌పాత్‌లు లేకపోవడం గురించి కథనాలు వస్తున్నాయి. రూల్ ఆఫ్ లా, స్వతంత్ర వైఖరి, ప్రమాణాల గురించి న్యాయవాదులు ముందుగా తెలుసుకోవాలని, విశ్వసనీయత పెంచుకోవాలని జస్టిస్ నరసింహ ఇచ్చిన మరో తీర్పుకు సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ సానుకూలంగా స్పందించింది. జస్టిస్ నరసింహ సూచించినట్లుగా న్యాయవాదులకు జాతీయ లీగల్ అకాడమీని ఏర్పర్చేందుకు సిద్ధమయింది. 'గురుబ్రహ్మ, గురుర్విష్ణుః, గురుర్దేవో మహేశ్వరః' అని శ్లోకాలు చదవడం ప్రధానం కాదు, ఆ గురువులకు సరైన జీతాలు ఇవ్వాలి.. అని గుజరాత్ విద్యాలయాల్లో అధ్యాపకులకు కనీస వేతన స్కేలును వర్తింపచేయాలని జస్టిస్ నరసింహ ఇచ్చిన తీర్పును కూడా అనేకమంది స్వాగతించారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్ పేరిట రాజస్థాన్ గుజరాత్ గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ పక్షులకు ముప్పు రాకుండా ఆయన అడ్డుకున్నారు.

మండుటెండల్లో మంచి చినుకుల్లాగా అప్పుడప్పుడూ జస్టిస్ నరసింహ మాత్రమే కాదు, జస్టిస్ ఉజ్జ్వల్ భుయాన్, జస్టిస్ విక్రంనాథ్, జస్టిస్ నాగరత్న, జస్టిస్ విశ్వనాథన్ తదితరులు ఇచ్చిన కొన్ని మంచి తీర్పులను విస్మరించలేం. వందమీటర్ల ఎత్తు దాటితే ఆరావళి పర్వతాలను కూల్చివేయవచ్చని ఇచ్చిన తీర్పును పర్యావరణవేత్తల ఆందోళనతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నిలిపివేశారు. పలు చెప్పుకోదగ్గ తీర్పులు అడపాదడపా సుప్రీంకోర్టు నుంచి వస్తున్నప్పటికీ న్యాయవ్యవస్థ స్వతంత్రంగా వ్యవహరిస్తోందా అన్న చర్చ మాత్రం ఆగడం లేదు.

దేశంలో ఉన్నత న్యాయస్థానం పాత్ర రోజురోజుకూ వివాదాస్పదంగా మారుతున్న విషయం చర్చనీయాంశమవుతోంది. సుప్రీంకోర్టు అస్తిత్వం కోల్పోతోందని, ఎవరి నియంత్రణలోనో ఉన్నట్లుగా వ్యవహరిస్తోందని, ప్రాథమిక హక్కులను విస్మరిస్తోందని మాజీ న్యాయమూర్తులు, సీనియర్ న్యాయవాదులు సైతం వ్యాఖ్యానిస్తున్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై చెప్పు విసిరిన ఘటనను దేశం మరిచిపోకముందే గతవారం ఒక పిటిషనర్ నిండు కోర్టులో సీజేఐపై అసభ్య వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి ఘటనలు సర్వోన్నత న్యాయస్థానం పట్ల పెరుగుతున్న నిరాశా నిస్పృహలకు సంకేతాలుగా అభివర్ణించేవారున్నారు. మరో వైపు ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో భారీ ఎత్తున డబ్బు దొరికిన ఘటన రీత్యా ఆయనపై మహాభియోగం ప్రవేశపెట్టేందుకు పార్లమెంట్ సిద్ధమవుతోంది. న్యాయవ్యవస్థను ఆత్మరక్షణలో పడవేసేందుకు లభించే అవకాశాన్ని ప్రభుత్వం ఎందుకు వదులుకుంటుంది?

రాజ్యాంగ విలువలను పరిరక్షిస్తూ, అధికార దుర్వినియోగాన్ని అడ్డుకోవాలంటే న్యాయవ్యవస్థ స్వతంత్రత అవసరం అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్వయంగా స్టాక్ హోమ్‌లో జరిగిన ఒక సదస్సులో అభిప్రాయపడ్డారు. ప్రాథమిక హక్కులను కాపాడిన కేశవానంద భారతి, సమాఖ్య స్ఫూర్తిని పరిరక్షించిన ఎస్.ఆర్ బొమ్మై తదితర కేసులను ఆయన ఉటంకించారు. ఈ తీర్పులు చరిత్ర పుటల్లో కెక్కాయి. సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలు స్వేచ్ఛగా సజావుగా ఎలాంటి బయటి ఒత్తిడి లేకుండా వ్యవహరించేందుకు సుప్రీంకోర్టు గతంలో పలుమార్లు జోక్యం చేసుకుంది. మరి గత కొన్నేళ్లుగా సుప్రీంకోర్టు నుంచి ఇలాంటి ఎన్ని అద్భుతమైన తీర్పులు వచ్చాయి?

కొన్ని హైకోర్టుల నుంచి కూడా ఇటీవలి కాలంలో మంచి తీర్పులు వచ్చిన ఉదంతాలు లేకపోలేదు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తే నగర బహిష్కారం విధిస్తారా? అని బాంబే హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవ్ జె జమ్దార్ ప్రశ్నించారు. ప్రజలు ప్రభుత్వానికి బానిసలు కాదు, ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ నిరసన తెలుపడం, నినాదాలు చేయడం వారి హక్కు అని ఆయన ప్రకటించారు. పోలీసులు ప్రజలకు సేవకులే కానీ ప్రభుత్వానికి కాదని జస్టిస్ మాధవ్ స్పష్టం చేశారు. కాక్రోచ్ జనతా పార్టీ ఎక్స్ అకౌంట్‌ను బ్లాక్ చేయడాన్ని ప్రశ్నించిన ఢిల్లీ హైకోర్టు ఆ అకౌంట్‌పై నిషేధం ఎత్తివేయాల్సిందిగా ఆదేశించింది. 'న్యాయమూర్తులేమీ పవిత్రమైన గోవుల్లాంటి వారు కాదు, వారిలో కూడా అవినీతిపరులు ఉన్నారు' అని మద్రాస్ హైకోర్టు వ్యాఖ్యానించింది. ఒక న్యాయమూర్తి అవినీతికి పాల్పడిన విషయాన్ని చూపించిన సినిమాను నిషేధించాలని దాఖలైన పిటిషన్‌పై అలా స్పందించింది. విచిత్రమేమంటే న్యాయవ్యవస్థలో అవినీతి ఉన్నదని ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకంలో పేర్కొన్నందుకు సుప్రీంకోర్టు మూడో కన్ను తెరిచి ఆ పేరాను మార్పించింది. కోర్టుల్లో వేలాది కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు గతంలో చెప్పిన వివరాలను కూడా కొత్త అధ్యాయంలో తీసేశారు. కార్యనిర్వాహక వ్యవస్థ, చట్టసభలకు అతీతంగా న్యాయవ్యవస్థ స్వతంత్రంగా వ్యవహరిస్తుందని ఆ పాఠ్యపుస్తకంలో పేర్కొన్నారు. నిజంగా అలా జరుగుతోందా?

ప్రపంచ జస్టిస్ నివేదిక ప్రకారం, రూల్ ఆఫ్ లా విషయంలో భారతదేశం 86వ స్థానంలో ఉన్నది. అమెరికాకు చెందిన ఒక స్వతంత్ర సంస్థ రూపొందించిన ఆ నివేదిక ప్రకారం, అమెరికాలో కూడా రూల్ ఆఫ్ లా అంత గొప్పగా లేదని, ఆ విషయంలో అది 36వ స్థానంలో ఉన్నదని తేల్చింది. ప్రపంచంలో నాలుగోవంతు దేశాలు నిరంకుశత్వంలోకి జారిపోతున్నాయని అందులో అమెరికా, ఇండియా కూడా ఉన్నాయని స్వీడెన్‌కు చెందిన వీడెమ్ ఇనిస్టిట్యూట్ నివేదిక తెలిపింది. ఉదారవాద ప్రజాస్వామిక దేశం అన్న గుర్తింపును అమెరికా యాభై ఏళ్ల తరువాత తొలిసారి కోల్పోయిందని ఆ నివేదిక పేర్కొంది. భారత్‌లో పద్ధతి ప్రకారం వ్యవస్థలు కూలిపోతున్నాయని వెల్లడించింది. ప్రభుత్వాలు నిరంకుశంగా మారితే దాని ప్రభావం వ్యవస్థలపై నేరుగా ఉంటుందన్న విషయం వేరే చెప్పనక్కర్లేదు.

న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తి గురించి, వెలుపలి శక్తుల నుంచి వస్తున్న ఒత్తిళ్ల గురించి సిట్టింగ్ న్యాయమూర్తులైన జస్టిస్ నరసింహ, జస్టిస్ ఉజ్జ్వల్ భుయాన్, జస్టిస్ నాగరత్న, జస్టిస్ దీపాంకర్ దత్తా తదితరులు పదే పదే హెచ్చరిస్తూనే ఉన్నారు. కోర్టుల స్వతంత్రతకు అతి పెద్ద ముప్పు కోర్టుల నుంచే వస్తోందని ప్రస్తుత న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జ్వల్ భుయాన్ చెప్పారు... ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా ఉన్నదని చెబితే సరిపోదు, అది స్వతంత్రంగా పనిచేస్తున్నట్లు తెలియాలి అని జస్టిస్ దీపాంకర్ దత్తా అన్నారు. మాజీ న్యాయమూర్తుల్లో కూడా ప్రస్తుత పరిస్థితిపై ఆవేదన వ్యక్తం చేస్తున్న వారున్నారు. సమాఖ్య వ్యవస్థ ప్రమాదంలో పడిందని జస్టిస్ కురియన్ ఆందోళన వ్యక్తం చేశారు. విచారణ లేకుండా వేలాది మంది జైళ్లలో మగ్గుతున్నారని జస్టిస్ మదన్ లోకూర్ అంటే, ప్రాథమిక హక్కులను కాపాడే విషయంలో సుప్రీంకోర్టు నిదానంగా వ్యవహరిస్తోందని జస్టిస్ దీపక్ గుప్తా విమర్శించారు.సీనియర్ న్యాయవాదులూ ఇలాంటి అభిప్రాయాలనే వ్యక్తం చేస్తున్నారు. న్యాయవ్యవస్థ ప్రభుత్వ ఆగడాల నుంచి ప్రజలను కాపాడలేకపోతున్నదని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు దుశ్యంత్ దవే అన్నారు. గత కొన్నేళ్లుగా సుప్రీంకోర్టు నాయకత్వం దేశాన్ని, న్యాయవ్యవస్థను విఫలం చేసిందని ఆయన ఆరోపించారు. కపిల్ సిబాల్, ప్రశాంత్ భూషణ్, ఇందిరా జైసింగ్, సంజయ్ హెగ్డే తదితరులు కూడా తరచూ న్యాయ వ్యవస్థ దుస్థితిని ఎత్తిచూపుతున్నారు. ఈ దేశంలో ప్రజల కన్నా ప్రభుత్వాలే అభద్రతలో పడ్డట్లు అసహనానికి ఎక్కువగా గురవుతున్నట్లు కనపడుతోంది. పాలనపై దృష్టి కేంద్రీకరించాల్సిన ప్రభుత్వాలు తమ అసహనాన్ని, అభద్రతా భావాన్ని ప్రజలు, వ్యవస్థలపై చూపించినప్పుడే దుష్పరిణామాలు సంభవిస్తాయనడంలో అతిశయోక్తి లేదు.

## సమ్మిళిత పట్టణాభివృద్ధిపై ఏపీ ప్రభుత్వం, యూఎన్ హ్యాబిటాట్ ఒప్పందం

మొదటి పేజీ తరువాయి

**అమరావతి, జూలై 15 :**
రాష్ట్రంలో సమ్మిళిత పట్టణాభివృద్ధిని ప్రోత్సహించేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు ఐక్యరాజ్య సమితికి చెందిన యూఎన్ హ్యాబిటాట్ మధ్య కీలక అవగాహనా ఒప్పందం కుదిరింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యూఎన్ హ్యాబిటాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనక్లాడియా రోస్బాక్ సమక్షంలో ఈ వ్యూహాత్మక ఒప్పందాన్ని ఏపీ పురపాలక శాఖ, యూఎన్ హ్యాబిటాట్ సంస్థలు కుదుర్చుకున్నాయి. సింగపూర్ నుంచి వర్చువల్ గా హాజరైన అనక్లాడియా సమక్షంలో జరిగిన ఈ ఒప్పందం ద్వారా అమరావతిలో పట్టణ వ్యవహారాలపై సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ఏర్పాటు చేయనున్నారు. పట్టణ పేదల జీవనోపాధిని మెరుగుపరచడం, ప్రాంతీయ ఆర్థిక వృద్ధి కోసం వ్యూహాత్మక ప్రణాళికలు, వాతావరణ మార్పులను తట్టుకునే సుస్థిర పర్యావరణ వ్యవస్థల నిర్మాణం, డిజిటల్ గవర్నెన్స్ వంటి అంశాలపై ఉమ్మడిగా పనిచేయనున్నారు.

**అమరావతిలో గ్లోబల్ బెస్ట్ ప్రాక్టీసెస్**
రాజధాని అమరావతి నిర్మాణంలో ప్రపంచంలోని అత్యుత్తమ విధానాలను అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. గ్రీన్ ఫీల్డ్ నగరంగా అమరావతిని నిర్మిస్తున్నామని, పట్టణ పేదరిక నిర్మూలనపై యూఎన్ హ్యాబిటాట్ తో కుదుర్చుకున్న ఒప్పందం చారిత్రాత్మకం అవుతుందని పేర్కొన్నారు. జీరో పావర్టీపై రోడ్ మ్యాప్ నిర్దేశించుకుని ప్రభుత్వం పనిచేస్తోందని, పేదల జీవన ప్రమాణాలు పెంచేందుకు పీ4 కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని వివరించారు. అర్బన్ ప్లానింగ్, లివబిలిటీ, డిజిటల్ గవర్నెన్స్ లో ఏపీ అగ్రస్థానంలో ఉందని, బెస్ట్ ప్రాక్టీసెస్ బ్రాండ్ అంబాసిడర్ గా తాను వ్యవహరిస్తానని ప్రకటించారు.

**చంద్రబాబు విజన్ కు ప్రతిరూపం అమరావతి**
రాజధాని అమరావతి నిర్మాణం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్ కు ప్రతిరూపంగా ఉందని యూఎన్ హ్యాబిటాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనక్లాడియా రోస్బాక్ కొనియాడారు. ఏపీ ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందం చారిత్రాత్మకమని, వ్యర్థాల నిర్వహణ, వాయు కాలుష్య నియంత్రణ, బహిరంగ ప్రదేశాల అభివృద్ధి తదితర అంశాలపై కలిసి పనిచేస్తామని తెలిపారు. ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం 2036 నాటికి పునరుత్పాదక ఇంధన రంగంలోనూ సమూల మార్పులు తీసుకువచ్చేందుకు సహకరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**ప్రపంచ వేదికపై ఏపీ విజయాల ప్రదర్శన**
ఈ ఒప్పందంలో భాగంగా 2028లో మెక్సికోలో జరగనున్న 14వ వరల్డ్ అర్బన్ ఫోరమ్ సదస్సులో ఆంధ్రప్రదేశ్ సాధించిన విజయాలను ప్రపంచ వేదికపై ప్రదర్శించాలని ఇరుపక్షాలు నిర్ణయించాయి. డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకుంటూ ఆర్థికాభివృద్ధిపై మంత్లీ ఎకనామిక్ రిపోర్టుల ద్వారా ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. బయోడైవర్సిటీని సంరక్షించేలా గ్రీన్ ఎనర్జీ విద్యుత్ ఉత్పత్తి కోసం పెద్ద ఎత్తున చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్ మరియు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఆర్థికాభివృద్ధి కేంద్రంగా రాజధాని అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

మొదటి పేజీ తరువాయి

**అమరావతి, జూలై 15:**
రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజలు వచ్చి నివసించేలా రాజధాని అమరావతి ఇంటిగ్రేటెడ్ మాస్టర్ ప్లాన్ ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ ఆర్థికాభివృద్ధికి కేంద్ర బిందువుగా నిలిచేలా అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. అమరావతి–2.0 ఇంటిగ్రేటెడ్ మాస్టర్ ప్లాన్, ల్యాండ్ పూలింగ్ స్కీమ్ రూపకల్పన పనుల పురోగతిపై అధికారులు, సింగపూర్ ప్రతినిధులతో ముఖ్యమంత్రి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సింగపూర్ ప్రతినిధులు ప్రాజెక్టు పరిధి, అమలు ప్రణాళిక, దశలవారీ కార్యాచరణను వివరించారు.

**ఉద్యోగాల కల్పనే ప్రధాన లక్ష్యం**
రాజధాని ప్రాంతంలో పెద్ద ఎత్తున ఉద్యోగాల కల్పన జరిగేలా అమరావతి ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావాలని ముఖ్యమంత్రి సూచించారు. ఏరియా ప్లాన్, మౌలిక వసతుల ప్రణాళిక, పెట్టుబడి నమూనా వంటి అంశాలను ఈ ప్రాజెక్టులో భాగం చేస్తున్నట్లు వెల్లడించారు. గ్లోబల్ బెంచ్ మార్కింగ్ చేరుకోవడం, అత్యధిక తలసరి ఆదాయం సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. అమరావతిని ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకు క్రియేటివ్ సిటీ నిర్మాణం చేయాల్సి ఉందన్నారు.

**అంతర్జాతీయ స్థాయి రవాణా వ్యవస్థ**
ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్ల నిర్మాణంతో అమరావతిని అంతర్జాతీయ స్థాయి నగరంగా నిర్మిస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. ఎల్‌నినో ప్రభావంతో నీటి సమస్య తలెత్తినా, పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను కృష్ణా నదికి తీసుకురావడంతో రాజధాని ప్రాంతం ప్రస్తుతం జల వనరులతో కళకళలాడుతోందని గుర్తుచేశారు. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ బిల్డింగ్ విధానాలతో పర్యావరణ అనుకూల పద్ధతులను ఇక్కడ విరివిగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమీక్షా సమావేశంలో పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, ముఖ్యకార్యదర్శులు సురేశ్ కుమార్, పీయూష్ కుమార్ మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మేడిగడ్డపై కేంద్రం తీరు దారుణం

మొదటి పేజీ తరువాయి

గతంలో పోలవరం డయాఫ్రమ్ వాల్ దెబ్బతింటే.. ఎన్డీఎస్ఏ పట్టించుకోలేదు. మేడిగడ్డ పిల్లర్ కుంగితే మాత్రం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని కేంద్రం తీరుపై కెటిఆర్ మండిపడ్డారు. మేడిగడ్డ బ్యారేజీపై నివేదిక ఇచ్చింది ఎన్డీఎస్ఏ కాదు.. ఎన్డీఏ అన్నారు. ఢిల్లీలో మీడియాతో ఆయన చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మేడిగడ్డ విషయంలో నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) తీరుపై కేటీఆర్ విమర్శలు చేశారు. తెలంగాణలో కోటి ఎకరాలకు పైగా నిషేధిత జాబితాలో చేర్చారు. రెవెన్యూ మంత్రి 30 శాతం వసూళ్లు చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలకు చేస్తున్న పనులకు పొంతన లేదు. కాళేశ్వరంపై ఆయన పగబట్టి వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర ఇంజినీర్లు ఇచ్చిన నివేదికను బయటపెట్టాలని కెటిఆర్ ఢిల్లీలో మీడియాతో అన్నారు. గత రెండేళ్లలో కేసీఆర్ ఏ ఒక్కరి పేరు పెట్టి విమర్శలు చేయలేదు. రేవంత్‌కు మాత్రం.. కేసీఆర్ పేరు తలవని రోజు లేదు. రెండు రోజులు ఢిల్లీలోనే ఉన్న సీఎం.. ఎన్డీఎస్ఏ అధికారులను ఎందుకు కలవలేదన్నారు. ఎన్డీఎస్ఏ ప్రాథమిక నివేదికకు.. తుది నివేదికకు చాలా వ్యత్యాసం ఉంది. మేడిగడ్డపై చూపిన శ్రద్ధ.. మిగతా రాష్ట్రాలపై ఎందుకు చూపలేదని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వ పనితీరును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు. ఎల్‌నినో పరిస్థితుల్లోనూ నీటి సమస్య రాకుండా ఆ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ క్లిష్ట సమయంలోనూ పట్టిసీమ నుంచి నీటిని ఎత్తిపోస్తూ రైతుల ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేస్తోందని చెప్పారు. ఈ విషయంలో ఆ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత.. తెలంగాణ ప్రభుత్వం ఇవ్వట్లేదన్నారు. సముద్రంలోకి పోయే నీటి వినియోగానికి ఏపీ అన్ని ప్రయత్నాలు చేస్తోందని కేటీఆర్ పేర్కొన్నారు. సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సిసి ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కలిసింది. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ఆదిలాబాద్ నుంచి మాజీ మంత్రి జోగురామన్న, ఎంపీ వద్దిరాజు రవిచంద్రతోపాటు సీసీఐ సాధాన సమితి సభ్యులను అందరినీ తీసుకొని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామిని కలిశామని అన్నారు. 1980వ దశకంలో ఏర్పాటు చేయబడ్డ సిమెంట్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా ఎ÷–లాంట్ ఒకదశలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 6 వేల మందికి ఉద్యోగాలు కల్పించిందని అన్నారు. రాబోయే 100 సంవత్సరాల వరకు మీకు మైన్ స్టోన్ రిజర్వ్‌లు కూడా మీకు ఉన్నాయి. 4 లక్షల మెట్రిక్ టన్నుల కెపాసిటీతో ఉన్న ఈ ప్లాంట్‌ను నడిపేందుకు అవకాశాలు సంపూర్ణంగా ఉన్నాయన్నారు. గతంలో 2019లో కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా మాటిచ్చారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఈ ప్లాంట్‌ను తప్పకుండా తెరిపిస్తామని పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా చెప్పారు.

## పట్టిసీమ ప్రాజెక్టుతోనే కృష్ణా డెల్టాకు సిరులు:

మొదటి పేజీ తరువాయి

**ప్రాజెక్టులపై గత పాలకుల నిర్లక్ష్యం**
గత పాలకులు సాగునీటి రంగంపై చూపిన నిర్లక్ష్యం వల్ల రాష్ట్రానికి తీవ్ర నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి విమర్శించారు. అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోయినా, గుండ్లకమ్మ, పులిచింతల ప్రాజెక్టు గేట్లు దెబ్బతిన్నా కనీస మరమ్మతులు కూడా చేయలేదని ఆరోపించారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన పోలవరం ప్రాజెక్టు పనులను పూర్తిగా గాలికి వదిలేసి, చివరకు డయాఫ్రామ్ వాల్ దెబ్బతినడానికి కారణమయ్యారని పేర్కొన్నారు. తమ గత హయాంలో పోలవరం పనులను 72 శాతం పూర్తి చేయగా, ప్రస్తుత ప్రభుత్వ చొరవతో పనులు మరింత వేగవంతం అయ్యాయని వివరించారు.

**నదుల అనుసంధానమే లక్ష్యం**
దేశంలో నిర్మించిన గోల్డెన్ క్వాడ్రిలేటరల్ రోడ్డు మార్గం తరహాలోనే దేశవ్యాప్తంగా నదుల అనుసంధానం జరగాలని చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వంశధార నది నుంచి పెన్నా నది వరకు అన్ని ప్రధాన నదులను అనుసంధానించడమే తమ లక్ష్యమని ప్రకటించారు. వృథాగా సముద్రంలో కలుస్తున్న వరద జలాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా సాగు, తాగు నీటి అవసరాలను తీర్చడమే కాకుండా పారిశ్రామిక అభివృద్ధికి బాటలు వేయవచ్చని, తద్వారా రాష్ట్రంలో సంపద సృష్టి జరుగుతుందని తెలిపారు.

**మూడేళ్లలో 36 ప్రాజెక్టుల పూర్తి**
రాష్ట్రంలో సాగునీటి రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రాధాన్యతా క్రమంలో 36 ప్రాజెక్టులను గుర్తించామని, వీటిని రాబోయే మూడేళ్ల కాలంలో రూ.35 వేల కోట్లతో పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. తుంగభద్ర ప్రాజెక్టుకు కొత్త గేట్లు ఏర్పాటు చేశామని, ధవళేశ్వరం బ్యారేజీ కొత్త గేట్ల పనులకు కూడా శ్రీకారం చుట్టామని తెలిపారు. గుంటూరు ఛానల్ ఆధునీకరణ పనులకు కూడా త్వరలోనే శంకుస్థాపన చేసి రెండేళ్లలో పూర్తి చేస్తామన్నారు. వచ్చే ఆగస్టు 14వ తేదీ నాటికి పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి గోదావరి జలాలను తీసుకువస్తామని వివరించారు.

**వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం**
వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ పనులను 2026 సెప్టెంబరు 1వ తేదీన జాతికి అంకితం చేస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గత పాలకులు పనులు పూర్తి కాకుండానే, కనీసం సొరంగంలో యంత్రం ఇరుక్కుపోయి ఉన్నా ప్రాజెక్టు పూర్తయిందంటూ ప్రజలను మోసం చేశారని ధ్వజమెత్తారు. జలధార కార్యక్రమం కింద రాష్ట్రంలో పడే ప్రతి వర్షపు చుక్కను భూగర్భ జలంగా మార్చేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. రాయలసీమ ప్రాంతం ఎడారి కాకుండా శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపడుతున్నామని చంద్రబాబు నాయుడు వెల్లడించారు.

**కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు**
దేశంలో సాగునీటి రంగ అభివృద్ధిలో శ్రీశైలం, నాగార్జున సాగర్ వంటి ప్రాజెక్టుల నిర్మాణంలో కేఎల్ రావు అందించిన సేవలు అజరామరమని ముఖ్యమంత్రి కొనియాడారు. వారి తర్వాత ఎన్టీఆర్ సాగునీటి రంగంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్, స్థానిక శాసనసభ్యుడు వసంత కృష్ణ ప్రసాద్ తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## జగన్ రెడ్డి నేరపూరిత వైఖరిపై వర్ల రామయ్య తీవ్ర ధ్వజం

మొదటి పేజీ తరువాయి

**మంగళగిరి, జూలై 15 :**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్ జగన్మోహన్ రెడ్డి అడుగుపెట్టిన తర్వాత రాజకీయ నాయకుడనే పదానికే ఉన్న గౌరవం దెబ్బతిందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య విమర్శించారు. మంగళగిరి ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జగన్ రాజకీయాలను వ్యక్తిగత కక్షలు, దౌర్జన్యాలతో కలుషితం చేశారని మండిపడ్డారు. తన తండ్రి రాజశేఖర రెడ్డి అధికారాన్ని అడ్డం పెట్టుకుని క్విడ్ ప్రో కో ద్వారా కోట్లాది రూపాయలు కొల్లగొట్టి, ఏకంగా 16 నెలల పాటు జైల్లో ఉన్న చరిత్ర జగన్దని గుర్తుచేశారు. జైలు ప్రభావం వల్లే నేరస్థులు, అసాంఘిక శక్తులు అంటే జగన్కు విపరీతమైన ప్రేమని ఆరోపించారు. రౌడీ షీటర్లను చంకనబెట్టుకోవడం వల్లే మంచి బుద్ధి ఉన్న యువత రాజకీయాల్లోకి రావడానికి భయపడుతున్నారని తెలిపారు.

**అసెంబ్లీని బూతుల వేదికగా మార్చారు**
గతంలో ఈ రాష్ట్రాన్ని ప్రకాశం పంతులు, సంజీవరెడ్డి, ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు వంటి మహామహులు పాలించారని వర్ల రామయ్య పేర్కొన్నారు. కానీ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత శాసనసభను బూతులు మాట్లాడుకునే వేదికగా మార్చేశారని ధ్వజమెత్తారు. వైకాపా నాయకులు చేసిన వ్యక్తిగత విమర్శలు భరించలేక నాడు చంద్రబాబు తీవ్ర మానసిక క్షోభ అనుభవించి శపథం చేశారన్నారు. మళ్లీ ఆ కౌరవ సభను పవిత్రమైన గౌరవ సభగా మార్చి చంద్రబాబు ముఖ్యమంత్రిగా సగర్వంగా అడుగుపెట్టారని వివరించారు. చట్టసభల విలువలను కాపాడటం కేవలం తెలుగుదేశం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమైందని స్పష్టం చేశారు.

**బాధితులను పట్టించుకోని జగన్ మనస్తత్వం**
గత ప్రభుత్వ హయాంలో 14 ఏళ్ల అమర్నాథ్ గౌడ్ను వైకాపా సానుభూతిపరులు సజీవ దహనం చేసినా నాడు జగన్ పట్టించుకోలేదని వర్ల రామయ్య ఆరోపించారు. బాధితులకు భరోసా ఇవ్వకుండా కేసును గాలికి వదిలేశారని, ఇది జగన్ క్రిమినల్ మనస్తత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. అమాయక బాధితుల కుటుంబాలను పలకరించడానికి మనసు రాని జగన్కు, నేరగాళ్లను కలుసుకోవడానికి మాత్రం కాళు పరిగెత్తుకుంటూ వస్తున్నాయని ప్రశ్నించారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడు రోడ్డు ప్రమాదంలో ఒక యాదవ్ కుర్రాడి చావుకు కారణమైతే, నకిలీ ముద్దాయిని నిలబెట్టి తప్పు దారి పట్టించే ప్రయత్నం చేశారని విమర్శించారు. నిజాయితీగా దర్యాప్తు చేస్తున్న పోలీసులపైనే జగన్ తిరగబడటం సిగ్గుచేటన్నారు.

**ప్రశ్న రావణ్ వెనుక వైకాపా హస్తం**
ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్న 'ప్రశ్న రావణ్' అనే వ్యక్తి జగన్ పూర్తి సపోర్ట్ ఉన్న అంతర్జాతీయ క్రిమినల్ అని వర్ల రామయ్య ఆరోపించారు. నగ్న వీడియోలు తీయడం, ఆడబిడ్డలను బ్లాక్‌మెయిల్ చేయడం వాడి పని అని, ఈ దారుణమైన నేర నెట్‌వర్క్ వెనుక జగన్ ఉన్నారనేది స్పష్టమవుతోందని పేర్కొన్నారు. తప్పు చేసి అడ్డంగా దొరికిపోయిన క్రిమినల్‌కు కులాల ముసుగు వేసి సపోర్ట్ చేస్తున్నారని మండిపడ్డారు. కల్తీ మద్యం అమ్మి 27 మంది ప్రాణాలు తీసిన కేసులో జైల్లో ఉన్న జోగి రమేష్కు స్వాగతం పలకడానికి జగన్ వెళ్లడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. కూటమి ప్రభుత్వంలో చట్టం ఎవరినీ వదిలిపెట్టదని, నేరగాళ్లకు కొమ్ముకాసే జగన్ ఆటలు ఇకపై సాగవని హెచ్చరించారు.

## తండ్రి పక్కన నిద్రిస్తున్న చిన్నారిని అపహరించి.. బ్లేడ్‌తో ఒళ్లంతా దాడి చేసి..

బీర్కూర్: తండ్రి పక్కన నిద్రిస్తున్న 7 నెలల చిన్నారిని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించి బ్లేడ్‌తో ఒళ్లంతా తీవ్రగాయాలు చేశారు. అనంతరం చెట్ల పొదల్లో పడేశారు. ఈ హృదాయ విదారకరమైన ఘటన కామారెడ్డి జిల్లా బీర్కూర్‌లో చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. బీర్కూర్ ఇందిరా కాలనీకి చెందిన టేకు సతీష్– సంధ్య దంపతులకు వైష్ణవి (7నెలలు) సంతానం. మంగళవారం రాత్రి 7:30 గంటలకు తండ్రి సతీశ్ తన కుమార్తెతో కలిసి ఆరు బయట నిద్రపోయాడు. రాత్రి 8 గంటలకు కుమార్తె కన్పించకపోవడంతో భార్య వద్ద ఉంటుందనుకొని అక్కడే నిద్ర పోయాడు. తిరిగి ఉదయం 5 గంటలకు నిద్ర లేచిన సతీశ్ పాప ఏదని భార్య, తల్లిని అడిగాడు. వారు తమ వద్ద లేదనడంతో ఆందోళనకు గురయ్యారు. ఈక్రమంలో కుటుంబ సభ్యుల

# ఎస్ఐఆర్ విజయవంతానికి కౌన్సిలర్లు సహకరించాలి: మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

- పారదర్శకంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియ: వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం
- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ధ్యేయం: చైర్మన్ పుల్కం రాజు
- బీఎల్‌వోలకు కౌన్సిలర్లు అందుబాటులో ఉండాలి: తహసీల్దార్ జయంత్

వేములవాడ/ప్రజాదివాస్ జూలై 15

వేములవాడ మున్సిపాలిటీ పరిధిలో కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని వంద శాతం విజయవంతం చేసేందుకు స్థానిక వార్డు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పూర్తి స్థాయిలో సహకరించాలని వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు పిలుపునిచ్చారు. బుధవారం వేములవాడ మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మున్సిపల్ కమిషనర్ లోకేష్, తహసీల్దార్ జయంత్ సంయుక్త ఆధ్వర్యంలో కౌన్సిలర్లు, అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలో ఎస్ఐఆర్ కార్యక్రమ అమలు తీరు, ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పురోగతిపై సుదీర్ఘంగా చర్చించి, పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ధ్యేయంగా ఈ ప్రత్యేక కార్యక్రమం సాగుతోందని పేర్కొన్నారు. వార్డుల్లో విధులు నిర్వహిస్తున్న బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు), బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏలు)కు స్థానిక కౌన్సిలర్లు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ క్షేత్రస్థాయిలో అవసరమైన సహాయ సహకారాలు అందించాలన్నారు. ముఖ్యంగా 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ యువకుడిని ఓటరుగా నమోదు చేయించేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కోరారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోపు ఈ ప్రక్రియ మొత్తాన్ని విజయవంతంగా పూర్తి చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో, బాధ్యతాయుతంగా ముందుకు సాగాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ లోకేష్ మాట్లాడుతూ.. వార్డుల వారీగా ఓటరు నమోదు, సవరణ ప్రక్రియను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ విజయవంతానికి వార్డు అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సాంకేతిక లేదా ఇతర సమస్యలను వెంటనే పైఅధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.



అనంతరం తహసీల్దార్ జయంత్ మాట్లాడుతూ.. బీఎల్‌వోలు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్లకు ఎస్ఐఆర్ కార్యక్రమ విశిష్టతపై పూర్తి అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. ఓటరు జాబితాలో పేర్ల నమోదు, తప్పుల సవరణ, చిరునామాల మార్పుతో పాటు మరణించిన వారి వివరాల తొలగింపు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిశీలన ద్వారానే ఖచ్చితమైన ఓటరు జాబితాను రూపొందించడం సాధ్యమవుతుందన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, స్థానిక కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ మేనేజర్ సంపత్ రెడ్డి, ఎస్ఐఆర్ మాస్టర్ ట్రైనర్ శ్రీధర్, రెవిన్యూ ఇన్స్పెక్టర్లు శ్రీనివాస్, శ్రీధర్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# త్వరలోనే కుల సంఘాల భవన నిర్మాణ పనులు ప్రారంభం

- స్థలాన్ని పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వ విప్
- మూడో బ్రిడ్జి నిర్మాణ పనులను, సర్వీస్ రోడ్డు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి లను పరిశీలించిన విప్

వేములవాడ/ప్రజాదివాస్ జూలై 15

వేములవాడ పట్టణ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మంజూరైన బీసీ భవన్,అంబేద్కర్ భవన్, క్రిస్టియన్ భవన్, ఎస్టీ భవన్,నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు.బుధవారం వేములవాడ పట్టణంలో ఆయా భవనాల నిర్మాణానికి స్థలాలను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు.. నాలుగు భవనాలకు ఒక్కో భవనానికి 1 కోటి 30 లక్షలు మంజూరు





కేటాయించగ టెండర్లు కూడా పూర్తి కావడం జరిగింది.. భవన నిర్మాణాలకు స్థలాన్ని కేటాయించడానికి అవసరమైన ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు విప్ సూచించారు.. సమాజంలోని అన్ని వర్గాలకు ఉపయోగపడేలా నాణ్యమైన సౌకర్యాలతో ఈ భవనాలను నిర్మించనున్నట్లు తెలిపారు.అనంతరం ఫుట్ ఓవర్ బ్రిడ్జి ,తిప్పాపూర్‌లో నిర్మాణంలో ఉన్న మూడో బ్రిడ్జి పనులను విప్ పరిశీలించారు. ప్రస్తుతం పనులు తుది దశకు చేరుకున్నాయని, త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. బ్రిడ్జి అందుబాటులోకి వస్తే పట్టణంలో ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు ప్రజల రాకపోకలు మరింత సులభతరం అవుతాయని చెప్పారు.అదేవిధంగా తిప్పాపూర్ రైతులు తమ వ్యవసాయ క్షేత్రాలకు సులభంగా చేరుకునేందుకు సర్వీస్ రోడ్డు ఎంతో ఉపయోగంగా ఉంటుందని తెలిపారు..వేములవాడ పట్టణ అభివృద్ధితో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి అభివృద్ధి పనిని స్వయంగా పర్యవేక్షిస్తూ త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని విప్ తెలిపారు.

# త్వరలోనే కుల సంఘాల భవన నిర్మాణ పనులు ప్రారంభం

- స్థలాన్ని పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వ విప్
- మూడో బ్రిడ్జి నిర్మాణ పనులను, సర్వీస్ రోడ్డు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి లను పరిశీలించిన విప్

వేములవాడ/ ప్రజాదివాస్ జూలై 15

వేములవాడ పట్టణ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మంజూరైన బీసీ భవన్,అంబేద్కర్ భవన్, క్రిస్టియన్ భవన్, ఎస్టీ భవన్,నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు.బుధవారం వేములవాడ పట్టణంలో ఆయా భవనాల నిర్మాణానికి స్థలాలను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు.. నాలుగు భవనాలకు ఒక్కో భవనానికి 1 కోటి 30 లక్షలు మంజూరు కేటాయించగ టెండర్లు కూడా పూర్తి కావడం జరిగింది.. భవన నిర్మాణాలకు స్థలాన్ని కేటాయించడానికి అవసరమైన ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు విప్ సూచించారు.. సమాజంలోని అన్ని వర్గాలకు ఉపయోగపడేలా నాణ్యమైన సౌకర్యాలతో ఈ భవనాలను నిర్మించనున్నట్లు తెలిపారు.అనంతరం ఫుట్ ఓవర్ బ్రిడ్జి ,తిప్పాపూర్‌లో నిర్మాణంలో ఉన్న మూడో బ్రిడ్జి పనులను విప్ పరిశీలించారు. ప్రస్తుతం పనులు తుది దశకు చేరుకున్నాయని, త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. బ్రిడ్జి అందుబాటులోకి వస్తే పట్టణంలో ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు ప్రజల రాకపోకలు మరింత సులభతరం అవుతాయని చెప్పారు.అదేవిధంగా తిప్పాపూర్ రైతులు తమ వ్యవసాయ క్షేత్రాలకు సులభంగా చేరుకునేందుకు సర్వీస్ రోడ్డు ఎంతో ఉపయోగంగా ఉంటుందని తెలిపారు..వేములవాడ పట్టణ అభివృద్ధితో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి అభివృద్ధి పనిని స్వయంగా పర్యవేక్షిస్తూ త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని విప్ తెలిపారు.





# రుద్రంగిలో అనుమానాస్పద స్థితిలో రైతు మరణం.. కేసు నమోదు చేసిన పోలీసులు

రుద్రంగి మండలం/ప్రజాదివాస్ జూలై 15



రుద్రంగి మండల కేంద్రానికి చెందిన బోయిని బక్కయ్య అనే రైతు తన పంట పొలంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎప్పటిలాగే పొలం పనుల నిమిత్తం వెళ్లిన ఆయన అక్కడే ప్రాణాలు కోల్పోవడంతో స్థానికంగా కలకలం రేగింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం పరీక్షల నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. రైతు మృతికి గల పూర్తి కారణాలు, ఇతర వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

# ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలవడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేసిన రాష్ట్ర ప్రభుత్వ విప్



వేములవాడ/ప్రజాదివాస్ జూలై 15

ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలవడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు.. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ముఖ్యమంత్రి సహాయనిధి (జవీ=ఖీ) చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వేములవాడ పట్టణ పరిధికి చెందిన 37 మంది లబ్ధిదారులకు రూ.13 లక్షల 57 వేల, వేములవాడ అర్బన్ మండల పరిధికి చెందిన 18 మంది లబ్ధిదారులకు రూ.5 లక్షల 66 వేల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్సలు పొందలేని నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగంగా మారిందన్నారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా ప్రభుత్వం అండగా నిలుస్తుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు.అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వేగంగా ఆర్థిక సహాయం అందించడం వల్ల వారికి ఆర్థిక భారం తగ్గుతోందని పేర్కొన్నారు...

# భూ వివాదంలో వృద్ధుడి హత్య.. జగిత్యాల జిల్లా కొడిమ్యాలలో ఘటన

కోడిమ్యాల మండలం /ప్రజాదివాస్ జూలై 15



భూ వివాదం కారణంగా ఓ వృద్ధుడు హత్యకు గురయ్యాడు. ఈ ఘటన జగిత్యాల జిల్లా కొడిమ్యాలలో మంగళవారం జరిగింది. ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. కొడిమ్యాల మండలం డబ్బు తిమ్మాయపల్లి గ్రామానికి చెందిన హన్మంతు (68)కు అదే గ్రామానికి చెందిన రాజనర్సుతో భూమి హద్దుల విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో హన్మంతు మంగళవారం ఎక్స్ ఎల్ బండిపై వెళ్తుండగా... రాజనర్సు కర్రతో దాడి చేశాడు. దీంతో తీవ్రంగా గాయపడ్డ హన్మంతు అక్కడికక్కడే చనిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# ప్లాస్టిక్‌కు గుడ్‌బై.. పర్యావరణ పరిరక్షణే ధ్యేయం!

- వేములవాడ మున్సిపల్ లోని శత్రాజుపల్లి రెడ్డి . సంఘం నిర్ణయం
- ఆదర్శంగా నిలిచిన కౌన్సిలర్ ఏనుగు జ్యోతి, తిరుపతిరెడ్డి

వేములవాడ/ప్రజాదివాస్ జూలై 15






ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో మనమందరం ముందుందామని కౌన్సిలర్ ఏనుగు జ్యోతి, తిరుపతి రెడ్డి అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మున్సిపల్ విలీన గ్రామం రెండో వార్డ్ శత్రాజుపల్లి లోని రెడ్డి సంఘంలో , నిర్వహించే ప్రతి శుభకార్యం, వివాహం, సభ, సమావేశం మరియు సామాజిక కార్యక్రమంలో సింగిల్-యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని పూర్తిగా నివారించాలని నిర్ణయించాము. అందువల్ల అందరూ ఈ క్రింది విషయాలను తప్పనిసరిగా పాటించవలసిందిగా మనవి. ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు, స్పూన్లు, కవర్లు మరియు క్యారీ బ్యాగులు ఉపయోగించవద్దు. వాటి స్థానంలో కాగితం, ఆకు పాత్రలు, స్టీల్ లేదా ఇతర పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ఉపయోగించండి. ప్రతి కార్యక్రమాన్ని ప్లాస్టిక్ రహిత వేడుకగా నిర్వహించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు అవ్వండి. ఈ రోజు ప్లాస్టిక్‌ను వదిలితే... రేపటి తరాలకు పరిశుభ్రమైన ప్రకృతిని అందించగలం. అయితే ఈ కార్యక్రమాన్ని కౌన్సిలర్ జ్యోతి ఏనుగు తిరుపతిరెడ్డి కోరిక మేరకు ముందుకు వచ్చిన రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొమ్ముల స్వామి రెడ్డి, మరియు సభ్యులను అభినందించారు..

# రుద్రవరంలో తాగునీటి ప్లాంట్ల ఆకస్మిక తనిఖీ.. నీటి నాణ్యత ప్రమాణాలపై అధికారుల ఆరా




వేములవాడ/ ప్రజాదివాస్ జూలై 15

వేములవాడ అర్బన్ మండల పరిధిలోని రుద్రవరం గ్రామంలో బుధవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు పలు వాటర్ ప్లాంట్లను ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు చేపట్టారు. గ్రామ ప్రజలకు సరఫరా అవుతున్న తాగునీటి నాణ్యత, ప్లాంట్ల నిర్వహణ తీరును అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా నీటి శుద్ధి ప్రక్రియ సరిగ్గా జరుగుతుందా లేదా? నీటి నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారా? అనే అంశాలపై ఆరా తీశారు. ప్లాంట్ల పరిసరాల పరిశుభ్రతను పరిశీలించి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నిరంతరం స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీటిని అందించడమే లక్ష్యంగా ఈ తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధికారి (ఫీూ) శ్రీధర్, స్థానిక వైద్యురాలు డాక్టర్ దివ్యశ్రీ, గ్రామీణ నీటి సరఫరా విభాగం (=ఔూ) అసిస్టెంట్ ఇంజనీర్ (ూజు) రాణి, గ్రామ పంచాయతీ కార్యదర్శి మమత, సర్పంచ్ ఊరడి సునీత రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కోరుట్ల-వేములవాడ ప్రధాన రహదారిపై బ్లాక్ స్పాట్ల పరిశీలన

- జిల్లా కలెక్టర్ ఆదేశాలతో జిల్లా రోడ్డు భద్రత కమిటీ సంయుక్త తనిఖీలు -
ప్రమాదాల నివారణకు పలు సూచనలు

వేములవాడ/ప్రజాదివాస్ 15

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా రోడ్డు భద్రత కమిటీ సభ్యులు డీటీఓ డి. శ్రీనివాస్, ఆర్ ఒ బి డీఈ శాంతయ్య, ఆర్టీఏ సభ్యుడు సంగీతం శ్రీనాథ్, ఆర్ ఒ బి డీఈ (వేములవాడ), అలాగే రుద్రంగి, చందుర్తి పోలీసు అధికారులు సంయుక్తంగా కోరుట్ల--వేములవాడ ప్రధాన రహదారిపై ఉన్న ప్రమాదకర ప్రాంతాలను (బ్లాక్ స్పాట్స్) పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలను గుర్తించి సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు.రుద్రంగి చెక్‌పోస్ట్ సమీపంలోని సెమీ సర్కిల్ మలుపును పరిశీలించిన అధికారులు, వాహనాల వేగ నియంత్రణ కోసం రోడ్డు హెచ్చరిక బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్, రంబుల్ ప్యాడ్స్, రోడ్ స్టడ్స్



ఏర్పాటు చేయాలని సూచించారు. నందివాగు సమీపంలోని చిన్న కల్వర్టు వద్ద వాహనదారుల భద్రత కోసం క్రాష్ బ్యారియర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.రుద్రంగి ఇంద్రమ్మ చౌక్ వద్ద కోరుట్ల వైపు వెళ్లే రహదారిలో వాహనాలు అధిక వేగంతో ప్రయాణిస్తున్న నేపథ్యంలో రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. మీపూరిపల్లె సమీపంలో తరచుగా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతంలో రోడ్ స్టడ్స్, రంబుల్ ప్యాడ్స్ ఏర్పాటు చేసి ప్రమాదాలను తగ్గించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు.అలాగే మల్యాల సమీపంలోని లో-లెవెల్ క్రాస్‌వే వద్ద సైడ్ క్రాష్ బ్యారియర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. చందుర్తి మండలంలోని ఇంద్రమ్మ చౌరస్తా వద్ద ఉన్న ప్రమాదకర మలుపును పరిశీలించి రంబుల్ స్ట్రిప్స్, రోడ్ స్టడ్స్, హెచ్చరిక సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.మరిగడ్డ సర్కిల్ వద్ద మరిగడ్డ--సనుగుల రహదారి మరియు కోరుట్ల--వేములవాడ జంక్షన్‌ను ప్రమాదకర ప్రాంతంగా గుర్తించిన అధికారులు, అక్కడ రోడ్డు హెచ్చరిక బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్, రోడ్ స్టడ్స్ ఏర్పాటు చేయాలని సూచించారు.ఈ సందర్భంగా రోడ్డు భద్రతకు సంబంధించిన అన్ని మౌలిక సదుపాయాలను త్వరితగతిన ఏర్పాటు చేసి ప్రమాదాలను తగ్గించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సూచనలు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు.

# వేములవాడలో టీయూడబ్ల్యూజే (హెచ్-143) సభ్యత్వ నమోదు ప్రారంభం..

వేములవాడ/ ప్రజాదివాస్ జూలై 15

జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన హక్కుల పరిరక్షణే తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ టీయూడబ్ల్యూజే హెచ్-143 ప్రధాన లక్ష్యమని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా స్పష్టం చేశారు. వేములవాడ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొలిపాక నరసయ్య, ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలీ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ కొనసాగింది. ఈ సందర్భంగా లాయక్ పాషా మాట్లాడుతూ.. జర్నలిస్టుల వృత్తిగత గౌరవాన్ని కాపాడేందుకు, వారి సమస్యల పరిష్కారానికి సంఘం నిరంతరం పోరాడుతోందన్నారు. యూనియన్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకుని, ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్ నాయకత్వంలో జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పలు సంక్షేమ పథకాల అమలుకు కృషి చేసినట్లు గుర్తుచేశారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డులు, ఇళ్ల స్థలాల సాధన కోసం రాబోయే రోజుల్లో ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని భరోసా ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి సమిష్టి పోరాటాలే శరణ్యమని పేర్కొన్నారు. సమకాలీన సమాజంలో జర్నలిస్టులకు వృత్తిపరమైన సవాళ్లు పెరుగుతున్నాయని, ఇలాంటి తరుణంలో సంఘటితంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు జర్నలిస్టులు అభిప్రాయపడ్డారు. ఈ సభ్యత్వ నమోదు ప్రక్రియ జర్నలిస్టుల్లో నూతన ఉత్తేజాన్ని నింపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు, స్థానిక జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొని సభ్యత్వాలు నమోదు చేసుకున్నారు.




# ఈ నెల18న, కళాకారులు కవుల సమీక్ష సమావేశంను విజయవంతం చేయండి

- కళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ యెల్ల పోశెట్టి

వేములవాడ/ప్రజాదివాస్ జూలై 15

వేములవాడ లో తెలంగాణ ఉద్యమ కళాకారుల ప్రధాన కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరంఖఫీ కళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ గాయకులు కళాతపస్వి యెల్ల పోశెట్టి మాట్లాడుతూ హైదరాబాద్లోని సెక్రటరేట్ ఎదురుగా ఉన్న తెలంగాణ అమరవీరుల స్తూపం భవనం నందు ఈ నెల 18న జరిగే కళాకారులు కవులతో కేకే కమిటీ ముఖాముఖి సమీక్ష సమావేశమునకు రాష్ట్రంలోని 33 జిల్లాల అధ్యక్షులు కార్యదర్శులు కవులు కళాకారులు పాల్గొని విజయవంతం చేద్దాం ఉద్యమ కళాకారులను కవులను గుర్తించడానికి ప్రభుత్వం కేకే కమిటి నీ ఏర్పాటు చేసినందుకు తెలంగాణ ఉద్యమ కళాకారుల విభాగం రాష్ట్ర కమిటీ పక్షాన కృతజ్ఞతలు తెలియజేశారు సమీక్ష సమావేశంలో పాల్గొన్న వివిధ జిల్లాల అధ్యక్షులు కార్యదర్శులు కవులు కళాకారులు అందరూ ఈనెల 18 న ఉదయం 10 గంటల వరకు సమావేశం భవనంకు చేరుకోవాలని పిలుపునిచ్చారు ఈ సమావేశంలో ఉత్తర తెలంగాణ కళాకారుల విభాగం కో-ఆర్డినేటర్ బొడ్డు రాములు దక్షిణ తెలంగాణ కళాకారుల విభాగం కో-ఆర్డినేటర్ వెన్నమల్ల వెంకటేష్ రాజన్న సిరిసిల్ల కళాకారుల విభాగం అధ్యక్షులు వరాల దేవయ్య హన్మకొండ జిల్లా అధ్యక్షులు నాగుల సుధాకర్ తదితర కళాకారులు పాల్గొన్నారు




# జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సంకెపల్లి వాటర్ ప్లాంట్ ను తనిఖీ చేసిన అధికారులు

వేములవాడ/ ప్రజాదివాస్ జూలై 15

వేములవాడ అర్బన్ మండలం సంకెపల్లి గ్రామంలో తాగునీటి నాణ్యతను నిర్ధారించే దిశగా వాటర్ ప్లాంట్లపై అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ తనిఖీల్లో గ్రామ ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీటిని శుద్ధి చేసే విధానం, నీటి నాణ్యత ప్రమాణాలు, ప్లాంట్ల నిర్వహణ, పరిశుభ్రత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజలకు సురక్షితమైన, స్వచ్ఛమైన, నాణ్యమైన తాగునీరు అందించడమే ఈ తనిఖీల ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు.ఈ తనిఖీల సందర్భంగా ఎంపీవో శ్రీధర్, డాక్టర్ దివ్యశ్రీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాణి, గ్రామ పంచాయతీ కార్యదర్శి వినోద్ కుమార్ పాల్గొని ప్లాంట్ల నిర్వహణపై సంబంధిత నిర్వాహకులకు అవసరమైన సూచనలు చేశారు. గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, తాగునీటి నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని అధికారులు స్పష్టం చేశారు. ఈ విషయాన్ని సంకెపల్లి గ్రామ సర్పంచ్ రెడ్డవేణి పరశురామ్ తెలిపారు.



# ఎస్సీ, ఎస్టీ ప్రొఫెసర్లపై పీవీఎన్ఆర్ టీవీ వర్సిటీ అధికారుల వేధింపులు

- సంబంధంలేని కేసుల్లో ఇరికించే కుట్ర.
- కోర్టు ఉత్తర్వులను సైతం అమలు చేయని వైనం.
- ప్రశ్నించే గొంతులను తొక్కివేస్తూ మారుమూలలకు బదిలీ.
- మీడియా సమావేశంలో డాక్టర్ ఆర్.ఎస్. ప్రసన్న కుమార్ ఆవేదన, ఆగ్రహం.




ప్రజాదివాస్

ఎస్సీ, ఎస్టీ ప్రొఫెసర్లపై హైదరాబాద్ రాజేంద్రనగర్ లోని పి.వి.ఎన్.ఆర్. తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ అధికారులు వేధింపులకు పాల్పడుతున్నారని ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.ఎస్. ప్రసన్న కుమార్ (ప్రస్తుతం వి.ఆర్.ఎస్ తీసుకున్నారు) ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరి వ్యక్తుల ప్రోత్సాహబలంతో సంబంధం లేని కేసుల్లో ఇరికించే కుట్రలు పన్నుతున్నారని వాపోయారు. హైదరాబాద్ లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ అక్రమ మార్గంలో నియమించిన ఇన్చార్జ్ అధికారులను వెంటనే తొలగించి, సీనియారిటీ ప్రకారం అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ అధికారులు కోర్టు ఉత్తర్వులను సైతం ఉల్లంఘించడం శోచనీయమన్నారు.

**అక్రమాలపై ప్రశ్నిస్తే బదిలీలు:**

షెడ్యూల్డ్ కులం (మాదిగ)కు చెందిన తనపైనా, షెడ్యూల్డ్ తెగ (లంబాడ)కు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ (ఆక్వాకల్చర్ ఎక్స్‌టెన్షన్ - ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్నవారు) లపైన, ప్రస్తుతం విధుల్లో ఉన్న మరో ప్రొఫెసర్‌పైన ఉద్దేశపూర్వక, నిరాధారమైన, చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జ్ఞాన ప్రకాష్, రిజిస్ట్రార్ డాక్టర్ శరత్ చంద్ర, డీన్ ఆఫ్ ఫ్యాకల్టీ డాక్టర్ బి. ఉదయ్ కుమార్, పరిశోధనా విభాగం డైరెక్టర్ డాక్టర్ సిహెచ్. హరి కృష్ణ, ప్రొఫెసర్ డాక్టర్ రామ్ సింగ్, డాక్టర్ ఇ. సునీల్ ఆనంద్, నాన్-టీచింగ్ యూనియన్ అధ్యక్షుడు షర్ఫుద్దీన్ కలిసి కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఇటీవల తిరిగి విధుల్లోకి చేరిన ప్రొఫెసర్ డాక్టర్ కె. వెంకట రమణ (వెటర్నరీ గైనకాలజీ ఀ అబ్‌స్టెట్రిక్స్ విభాగం) పై ఉద్దేశపూర్వక,నిరాధారమైన, చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడుతున్నారు. అక్రమాలపై ప్రశ్నించినందుకు జగిత్యాల జిల్లా కోరుట్ల (సీ. వి. ఎస్సీ ) లోని మారుమూల ప్రాంతానికి బదిలీ చేశారని తెలిపారు.

**రిజిస్ట్రార్ కీలక పాత్ర:**

తనను వేధించడంలో రిజిస్ట్రార్ డాక్టర్ శరత్ చంద్ర కీలక పాత్ర పోషించారని డాక్టర్ ఆర్.ఎస్. ప్రసన్న కుమార్ ఆరోపించారు. ప్రొఫెసర్ సేవలందించిన తనపై మాజీ రిజిస్ట్రార్ డాక్టర్ కె. కొండల్ రెడ్డి, డీన్ ఆఫ్ ఫ్యాకల్టీ డాక్టర్ వి. లు కుట్ర పన్నుతున్నారని, రవీందర్ రెడ్డి కారణంగానే, 2017-2018లో నేను వరంగల్ జిల్లా మమ్నూర్ కె.వి.కె లో ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్‌గా పనిచేస్తున్నప్పుడు తన ప్రొబేషన్ మరియు పదోన్నతి (ప్రమోషన్ ) నిలిపివేయబడ్డాయన్నారు. తన వల్లే తాను ఆయనకు జూనియర్‌గా మిగిలిపోయానన్నారు. వీరు (పి.వి.ఎన్.ఆర్. టీ.వీ.యు) లోని 'లైవ్‌స్టాక్ ప్రొడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్' విభాగంలోనే పనిచేస్తున్నారు. ప్రస్తుతం తాను కాంగ్రెస్ కార్యకర్తగా ఉన్నానని, మాజీ ఐపీఎస్ అధికారి, ప్రస్తుతం బి. ఆర్ .ఎస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ సోదరుడినని వెల్లడించారు.

**చట్టవిరుద్ధం.. ఏకపక్ష చర్య:**

పి.వి.ఎన్.ఆర్. టీ.వీ.యు మాజీ వైస్-ఛాన్సలర్ మరియు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి బావమరిది అయిన డాక్టర్ రవీందర్ రెడ్డి, రిజిస్ట్రార్‌గా ఉన్న సమయంలో 2022లో పెబ్బేరులోని సి. ఎఫ్ .ఎస్. సి (కాలేజ్ ఆఫ్ ఫిషరీ సైన్స్) అసిస్టెంట్ ప్రొఫెసర్ (ఆక్వాకల్చర్ ఎక్స్‌టెన్షన్) డాక్టర్ బాలాజీ గుగులోతును ఉద్దేశపూర్వకంగా సస్పెండ్ చేశారు. హైకోర్టు తీర్పు వచ్చినప్పటికీ ఆయనను తిరిగి విధుల్లోకి తీసుకోలేదని, ఇది చట్టవిరుద్ధం, ఏకపక్ష చర్య అని ఆధారాలతో సహా ప్రసన్నకుమార్ వివరించారు. ఈ సమావేశంలో ప్రజా నాయకుడు సామాజికవేత్త క్రాంతికుమార్ , ఎమ్మార్పీఎస్ స్టేట్ నాయకుడు బోయ రమణ, ఎమ్మార్పీఎస్ లీడర్ రమేష్ ,దళిత మహిళ లీడర్ నికిత , ఓయూ లీడర్ అలెగ్జాండర్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రక్షణ సేన సంగారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జిగా కలబ్‌గూర్ దయాకర్ రెడ్డి నియామకం

ప్రజాదివాస్




తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసి, ప్రజా సమస్యలపై సమర్థవంతంగా పోరాటం చేయాలనే లక్ష్యంతో పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత సంగారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జిగా కలబ్‌గూర్ దయాకర్ రెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా కలబ్‌గూర్ దయాకర్ రెడ్డి మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి కీలక బాధ్యతను అప్పగించిన పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవితకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను పూర్తి నిబద్ధతతో నిర్వర్తిస్తూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు కార్యకర్తలను సమన్వయం చేసి, సంగారెడ్డి నియోజకవర్గంలో గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూ, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ రక్షణ సేన ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని పేర్కొన్నారు.కలబ్‌గూర్ దయాకర్ రెడ్డి నియామకాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వాగతిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

# ఎమ్మెల్యే జారేని సత్కరించిన గౌడ సంఘం నాయకులు

ప్రజాదివాస్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో రింగ్ రోడ్ సెంటర్ లోని జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణని గౌడ్ సంఘం పెద్దలు సత్కరించడం జరిగింది. అశ్వారావుపేట మున్సిపాలిటీ 15 వ వార్డు కౌన్సిలర్ మోర్ల రాజేశ్వరి మోర్ల వెంకన్న అధ్యక్షతన ఎమ్మెల్యే జారే ఆదినారాయణని రింగురోడ్ లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుంటాం అని గౌడ సంఘ పెద్దలు తెలియచేయడం జరిగింది. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోమని గౌడ్ సంఘం పెద్దలకు మాట ఇవ్వడం జరిగింది. సంతోషం వ్యక్తం చేసిన గౌడ సంఘం పెద్దలు ఎమ్మెల్యే జారేకి, చైర్ పర్సన్ శశికళమ్మ, వైస్ చైర్ పర్సన్ జూపల్లి రమేష్ బాబుకి, పార్టీ యువ నాయకులు జూపల్లి ప్రమోద్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గౌడ్ సంఘం పెద్దలు గొల్లపల్లి లక్ష్మణ్ వాసు, మోర్ల వెంకన్న, తాళం సూరిబాబు, మైనం రామకృష్ణ, ఆరేపల్లి వేణు, ఆరేపల్లి చందర్రావు, ఆరేపల్లి పెద్దోడు, తదితరులు పాల్గొనడం జరిగింది.

# నర్సారెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

- మైనంపల్లి కబడ్దార్
- సిట్టింగ్ స్థానాన్ని కోల్పోయిన నీకు గజ్వేల్ తో ఏం సంబంధం
- కుటుంబంగా సాగుతున్న గజ్వేల్ శ్రేణుల్లో నిప్పులు పోయాకు
- నర్సారెడ్డి అండతో ఎదిగిన మహిపాల్ రెడ్డి ఈరోజు ఆయనపైనే విమర్శలు చేయడం ఏంటి..
- తప్పుడు వ్యాఖ్యలు చేస్తే తగిన మూల్యం తప్పదు...
- పంచాయితీరాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షుడు కడపల్ల నరసింహా రెడ్డి
- కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ రెడ్డి

ప్రజాదివాస్

ఆస్తులను పణంగా పెట్టీ పార్టీ శ్రేణులకు కష్ట కాలంలో అండగా నిలుస్తున్న గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డిపై కొద్దిమంది నేతలు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ రెడ్డి, జిల్లా పంచాయతీ రాజ్ సంఘటన్ అధ్యక్షుడు కడపల్ల నరసింహా రెడ్డి,యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి,ఆత్మ కమిటీ అధ్యక్షుడు కనకయ్య గౌడ్,మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ప్రభాకర్ గుప్త పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన ములుగులో ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో నేతలు మాట్లాడుతూ మైనం పల్లి నీకు గజ్వేల్ తో ఏం సంబంధం, కుటుంబంగా ఉన్న గజ్వేల్లో నిప్పులు పోయవద్దన్నారు. ఏళ్లుగా నియోజకవర్గ శ్రేణులతో ఆరోగ్యం బాగాలేకున్న, ఆస్తులు అమ్ముకుని, కేసీఆర్ పై పోటీకి సైతం వెనుకడుగు వేయని నేతపై డబ్బుల ఆరోపణలు సరికాదన్నారు. అదేవిధంగా మైనంపల్లి నీ మల్కాజ్ గిరి సిట్టింగ్ స్థానాన్ని కోల్పోయిన నువ్వు ఇక్కడ ఏం వెలుగబెడుతవంటూ ఎద్దేవా చేశారు. ఇక నర్సన్న అండతో ఎదిగిన మనోహర బాద్ మహిపాల్ రెడ్డి నరసన్నపై విమర్శలు చేస్తున్నవు బిడ్డ జాగ్రత్త అంటూ ఘాటుగానే వ్యాఖ్యానించారు. నాటికి నేటికి మా నేత నర్సన్ననేనన్నారు. ఈ విషయంలో అధిష్టానం పని చేసే నాయకుడిని గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు సర్దార్ ఖాన్, డైరెక్టర్ కుతాడి శ్రీనివాస్,శశికాంత్ రెడ్డి,సర్పంచ్ లు ముత్యం రెడ్డి,ఎడ్ల పోచయ్య,విజేత వాసు,సురేందర్,బుర్కల మమత కనకయ్య,కవిత నర్సింలు,యాదగిరి,నాగిరెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎర్రవీరేష్, నాయకులు మల్లేష్ గౌడ్, గాడిపల్లి శ్రీనివాస్, మల్లేష్,ప్రభాకర్ రెడ్డి,సంజీవ్,ప్రదీప్ రెడ్డి,మణిపవన్ రెడ్డి,మంద వెంకట్,సత్తి రెడ్డి,ఆంజనేయులు,జహంగీర్,శేఖర్ గౌడ్ తో పాటు పలువురు శ్రేణులు ఉన్నారు.



# ఎస్ఐఆర్ ప్రత్యేక ఎన్నికల కార్యక్రమ నిర్వహణలో పాల్గొన్న వైస్ చైర్ పర్సన్ జూపల్లి



ప్రజాదివాస్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని ఎస్ఐఆర్ ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా బిఎస్ఆర్ నగర్ లో నిర్వహించిన ఎస్ఐఆర్ ఎన్నికల కార్యక్రమానికి అశ్వారావుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జూపల్లి రమేష్ బాబు మాట్లాడుతూ ఓటు హక్కు ప్రతి పౌరుని బాధ్యత అని పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు తప్పనిసరిగా ఎస్ఐఆర్ దరఖాస్తు (ఫారం) ను నింపి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇంకా ఎస్ఐఆర్ అప్లికేషన్ ఫారాలు తీసుకోని వారు స్థానిక ప్రజాప్రతినిధులు లేదా సంబంధిత బిఎల్ఓ లను సంప్రదించి ఫారాలను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, వార్డు కౌన్సిలర్లు జీలుగు రవి, మిండా హరిబాబు, నార్లపాటి మౌనిక, నార్లపాటి దివాకర్, ఎస్.కె. నూర్జహాన్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించబడింది. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌కేఎన్ఆర్ గార్డెన్స్‌లో జనసందోహం మధ్య ఘనంగా బండి రమేష్ జన్మదిన వేడుకలు ఘనంగా

- కమ్మ సంఘం నాయకుల నుంచి విశిష్ట సన్మానం






ప్రజాదివాస్

కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, టీపీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ జన్మదిన వేడుకలు ఈరోజు కూకట్‌పల్లిలోని ఎన్‌కేఎన్ఆర్ గార్డెన్స్ లో అపూర్వ జనసందోహం మధ్య అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కమ్మ సంఘం నాయకులు, సామాజిక సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున హాజరై రమేష్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా భారీ కేక్‌ను కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. పూలమాలలు, పుష్పగుచ్ఛాలు, శాలువాలు, జ్ఞాపికలతో రమేష్ ని ఘనంగా సత్కరించారు. కార్యకర్తల జైకారాలు, శుభాకాంక్షలతో ఎన్‌కేఎన్ఆర్ గార్డెన్స్ ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది. జన్మదిన వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా కమ్మ సంఘం నాయకులు బండి రమేష్ ని ఘనంగా సన్మానించారు. కమ్మ సమాజానికి చేస్తున్న సేవలు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సమాజ అభ్యున్నతికి చేపడుతున్న కార్యక్రమాలను కొనియాడుతూ శాలువా కప్పి, పూలమాలలు వేసి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, ప్రజా సేవలో బండి రమేష్ మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం బండి రమేష్ మాట్లాడుతూ, తనపై చూపుతున్న అపారమైన ప్రేమ, ఆదరణ, అభిమానానికి ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ జన్మదినాన్ని కేవలం సంబరంగా కాకుండా ప్రజా సేవకు మరింత అంకితమయ్యే సంకల్ప దినంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ కూకట్‌పల్లి నియోజకవర్గ అభివృద్ధి, పేదల సంక్షేమం, యువతకు అవకాశాలు కల్పించడం, కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తానని అన్నారు. జన్మదిన వేడుకల సందర్భంగా అన్నదాన కార్యక్రమం, కేక్ పంపిణీ, పేదలకు పండ్లు పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగి, ఎన్‌కేఎన్ఆర్ గార్డెన్స్ ప్రాంగణం వేలాది మంది నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కిక్కిరిసిపోయింది. ఈ వేడుకలు బండి రమేష్ ప్రజాదరణకు, ఆయనపై కార్యకర్తలు మరియు ప్రజల్లో ఉన్న అభిమానానికి నిదర్శనంగా నిలిచాయి.

# అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేత

ప్రజాదివాస్



సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం చౌదరిపల్లి గ్రామానికి చెందిన పోతగల్ల మల్కయ్య అనారోగ్య కారణాలతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకొని వారి కుటుంబాన్ని పరామర్శించిన తుమ్మ గణేష్,ఆధ్వర్యంలో మృతుని కుటుంబానికి అండగా నిలుస్తూ 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన తుమ్మ గణేష్, అవసర సమయంలో ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో సహాయం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తాళ్ల స్వామీ గౌడ్, నర్రా నవీన్, పోతగల్ల బాల్ నర్సింలు, గణేష్ బాలకృష్ణ, శివ, వంచి తదితరులు పాల్గొని బియ్యం పంపిణీ చేశారు.

# ఉప సర్పంచ్ ల ఫోరం మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గా మచ్చ గణేష్ ఏకగ్రీవం...!

ప్రజాదివాస్



ఉప సర్పంచ్ ల ఫోరం మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గా మచ్చ గణేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జగదేవపూర్ మండల ఉప సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు కంచర్ల స్వామి ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక సమావేశమై మండల ఉప సర్పంచ్ ల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ గా జగదేవపూర్ గ్రామ ఉప సర్పంచ్ మచ్చ గణేష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల ఉప సర్పంచ్ ల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ మచ్చ గణేష్ మాట్లాడుతూ నాకు ఈ అవకాశం కల్పించిన మండల ఉప సర్పంచ్ ల పోరం అధ్యక్షులు స్వామి కి మండల ఉపసర్పంచు అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నాపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తానని పేర్కొన్నారు. ఉప సర్పంచ్ ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన అన్నారు,కాగా నూతనంగా ఎన్నికైన మచ్చ గణేశుని సర్పంచుల పోరం మండల అధ్యక్షుల ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లు పాల్గొన్నారు.

TGTEL/25/A0827
ప్రజా దివాన్
తెలుగు దినపత్రిక
16-07-2026

## బిపిసిఎల్ ప్రాంగణంలో ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతం



ప్రజాదివాస్
రెటినోవా ఫౌండేషన్, పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్ (పి డబ్లు టి) మరియు నవోదయ సంక్షేమ వేదిక సంయుక్త ఆధ్వర్యంలో బిపిసిఎల్ ప్రాంగణంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ శిబిరంలో బిపిసిఎల్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య సేవలను పొందారు. శిబిరంలో వివిధ సంస్థల వైద్య నిపుణులు ఉచిత సేవలు అందించారు. ప్లానెట్ ఆప్టిక్స్ బృందం ఉచిత కంటి పరీక్షలు, క్లోవ్ డెంటల్ వైద్యులు దంత పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ కేర్ బృందం హోమియోపతి వైద్య సలహాలు అందించింది. శ్రీకర హాస్పిటల్స్ వైద్యులు సాధారణ ఆరోగ్య పరీక్షలు, రక్తపోటు (బి పి), రక్తంలో చక్కెర స్థాయి (జి ఆర్ బి ఎస్), ఈ సి జి పరీక్షలు చేశారు. అదనంగా రక్తదాన శిబిరం, వెల్‌నెస్ ప్రోగ్రామ్ ద్వారా టోటల్ బాడీ చెకప్‌లు కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెటినోవా ఫౌండేషన్ డైరెక్టర్ డి. సునీల్ కుమార్, నవోదయ సంక్షేమ వేదిక అధ్యక్షురాలు ఎం. శ్రీదేవి, పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్ (పి డబ్లు టి) చైర్మన్ సిహెచ్. వరప్రసాద్ పాల్గొన్నారు. అదేవిధంగా బిపిసిఎల్ ప్లాంట్ ఇన్‌చార్జ్ ఒ చీఫ్ మేనేజర్ మనోజిత్, ప్లాంట్ ఆపరేషన్స్ చీఫ్ మేనేజర్ మాలోతు కిషన్, ఆపరేటర్ పి. శ్రీనివాస్ పాల్గొని శిబిరాన్ని అభినందించారు. ఈ మెగా వైద్య శిబిరం ద్వారా వందలాది మంది ఉచిత వైద్య సేవలు పొందడంతో పాటు ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకున్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన అన్ని వైద్య బృందాలకు, బిపిసిఎల్ యాజమాన్యానికి మరియు స్వచ్ఛంద సేవకులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల ప్రత్యేక నిఘా

**- చట్టవిరుద్ధంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవు**




ప్రజాదివాస్
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసు శాఖ ఆదేశాల మేరకు అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి తెలంగాణ రాష్ట్రంలోని అశ్వారావుపేట ప్రాంతానికి అక్రమంగా ఇసుక రవాణా జరగకుండా పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ప్రభుత్వ అనుమతులు, చెల్లుబాటు అయ్యే రవాణా పత్రాలు లేకుండా లారీలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాల ద్వారా ఇసుకను తరలించడం చట్టవిరుద్ధం. ఇటువంటి అక్రమ రవాణాకు పాల్పడే వాహనాలను స్వాధీనం చేసుకుని, సంబంధిత వ్యక్తులపై భారతీయ న్యాయ సంహిత (బి.ఎన్.ఎస్), గనులు, ఖనిజాల అభివృద్ధి, నియంత్రణ చట్టం (ఎంఎండిఆర్ యాక్ట్)తో పాటు ఇతర వర్తించే చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నాము. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి తెలంగాణలోకి అక్రమంగా ఇసుక రవాణా చేసే వ్యక్తులు, వాహన యజమానులు, డ్రైవర్లు, నిర్వాహకులు, ఈ అక్రమ కార్యకలాపాలకు సహకరించే వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి. ప్రజలు ఎవరైనా అక్రమ ఇసుక రవాణాను గమనించినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్--100/112 ద్వారా సమాచారం అందించాలని కోరుతున్నాము. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయి. అశ్వారావుపేట ప్రాంతంలో అక్రమ ఇసుక రవాణాను పూర్తిగా అరికట్టేందుకు పోలీసులు నిరంతరం వాహన తనిఖీలు, ప్రత్యేక నిఘా, ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై ఎలాంటి ఉపేక్ష లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని ప్రజలకు తెలియజేయడమైనది. స్టేషన్ హౌస్ ఆఫీసర్ అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

## వెంకటాపూర్ గ్రామానికి చెందిన వడ్ల ఆంజనేయులకు రూ.2.40 లక్షల ఎల్‌వోసీ అందజేసిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్



ప్రజాదివాస్
సదాశివపేట మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన వడ్ల ఆంజనేయులు గారికి సంగారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ రూ. 2 లక్షల 40 వేల విలువైన ఎల్‌వోసీ ను నేడు అందజేశారు. ఈ ఆర్థిక సహాయం ద్వారా ఆయనకు అవసరమైన వైద్య చికిత్స అందేలా ప్రభుత్వం సహకరిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ డైరెక్టర్ పెద్దగొల్ల నగేష్ కురుమ, బీఆర్ఎస్ పార్టీ మండల యువత మాజీ అధ్యక్షుడు నరేష్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ సోలాపురం శంకర్, మాజీ వార్డు సభ్యుడు చిరంజీ బాబుజి, మాజీ విద్యా కమిటీ చైర్మన్ సాబేర్ అలీ, వార్డు సభ్యుడు దండే నవీన్ కుమార్, వడ్ల తేజు చారి తదితరులు పాల్గొన్నారు.

## "మై భారత్" ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించి అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్




ప్రజాదివాస్
మేడ్చల్-మల్కాజిగిరి, తెలంగాణ దేశ నిర్మాణ కార్యక్రమాలలో యువత భాగస్వామ్యాన్ని గరిష్ఠం చేసే లక్ష్యంతో, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్, ఐఎఎస్, బుధవారం "మై భారత్" పోర్టల్‌లో నమోదు కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. అనంతరం అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించి, 15 నుండి 29 ఏళ్ల మధ్య వయస్సు గల అర్హులైన యువత అంతా "మై భారత్" పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛంద సేవ, అనుభవపూర్వక అభ్యాసం, నైపుణ్యాభివృద్ధి, సామాజిక సేవ, భారత ప్రభుత్వం చేపట్టిన వివిధ యువజన-కేంద్రీకృత కార్యక్రమాలలో పాల్గొనే అవకాశాలను ఈ వేదిక కల్పిస్తుందని ఆయన వివరించారు. జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఈ నమోదు కార్యక్రమంలో విద్యాసంస్థలు, ప్రభుత్వ శాఖలు, యువజన సంఘాలు, ఎన్ ఎస్ ఎస్ యూనిట్లు, ఇతర భాగస్వామ్య పక్షాలు చురుకుగా పాల్గొని, అర్హులైన యువత గరిష్ఠ సంఖ్యలో నమోదు చేసుకునేలా చూడాలని ఆయన కోరారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజిగిరి "మై భారత్" డిప్యూటీ డైరెక్టర్ స్నేహల్ జ్ఞానేశ్వర్ బసుత్కర్, ఆఫీస్ అసిస్టెంట్ డి. శ్రీశైలం పాల్గొన్నారు. వీరు నమోదు ప్రక్రియతో పాటు, "మై భారత్" పోర్టల్ ద్వారా నమోదైన యువతకు లభించే ప్రయోజనాలు, అవకాశాల గురించి ఈ సందర్భంగా వివరించారు. ఈ విస్తృత నమోదు కార్యక్రమం కళాశాలలు, విద్యాసంస్థలు, గ్రామాలు, పట్టణ స్థానిక సంస్థలు, ఇతర ప్రభుత్వ సంస్థలలో అవగాహన కార్యక్రమాలు, అక్కడికక్కడే నమోదు చేసుకునే శిబిరాల ద్వారా నిర్వహించబడుతుంది.
ఈ ప్రచార కార్యక్రమాన్ని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా యంత్రాంగం సహకారంతో భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖకు చెందిన "మై భారత్" విభాగం సమన్వయం చేస్తోంది. అర్హులైన యువత అంతా "మై భారత్" పోర్టల్‌లో నమోదు చేసుకుని, 'వికసిత్ భారత్' లక్ష్య సాధనలో చురుకుగా భాగస్వాములు కావాలని ప్రోత్సహించారు.

## మాదక ద్రవ్యాల నిర్మూలనకు పూర్తి స్థాయిలో చర్యలు

**- జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి**



ప్రజాదివాస్
మాదక ద్రవ్యాల వ్యసనం సమాజానికి, ముఖ్యంగా యువత భవిష్యత్తుకు తీరని నష్టాన్ని కలిగిస్తుందని శారీరక, మానసిక సమస్యలకు గురిచేస్తుందని డ్రగ్స్ నివారించడానికి పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ విసి హాల్ లో ఏర్పాటు చేసిన మాదక ద్రవ్య నిర్మూలన సమావేశానికి అదనపు కలెక్టర్ హాజరైనారు. ఈ సందర్భంగా జిల్లాలో మాదక ద్రవ్యాల నిర్మూలనకు పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టాలని అందులో భాగంగా సంక్షేమ శాఖల అధికారులు ప్రతి నెల బాలుర హాస్టల్స్ లో అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగం పై వైద్య శాఖ వారు తగినవిధంగా అవగాహన కల్పించాలని అవసరమైన మేరకు వైద్య సదుపాయం కల్పించాలన్నారు. డ్రగ్స్ వాడకం తో కలిగే మానసిక, శారీరక సమస్యల పై ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. పోలీసు శాఖ వారు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ, సున్నితమైన ప్రదేశాలలో సమర్థవంతమైన నిఘాతో డ్రగ్స్ నిర్మూలనకు చ్యరలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పాఠశాలల్లో, కాలేజీల పై ప్రత్యేక నిఘాతో పర్యవేక్షించాలన్నారు. సంబంధిత శాఖల వారు ప్రణాళిక కార్యాచరణ ఏర్పాటు చేసుకోవాలని తద్వారా నిర్వహించిన కార్యక్రమాల వివరాలను తమకు తెలియజేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి మాదక ద్రవ్యాల నిర్మూలనలో జిల్లా ను ముందుంచాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖాధికారి వినోద్ కుమార్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి పద్మజా, డ్రగ్ ఇన్స్పెక్టర్ మౌనిక, అడిషనల్ డిసిపిలు కుత్బుల్లాపూర్ పురుషోత్తం, కూకట్ పల్లి సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ "యువ సంగ్రామ సభ" ఏర్పాట్లను పరిశీలించిన నాయకులు



ప్రజాదివాస్
సరూర్‌నగర్‌లో ఈ నెల 18న నిర్వహించే బీఆర్ఎస్ "యువ సంగ్రామ సభ"ను విజయవంతం చేయడానికి "యువ సంగ్రామ సభ" ఏర్పాట్లను పరిశీలించడం జరిగింది. బుధవారం ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, జూలై 18న సరూర్‌నగర్ స్టేడియంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న "యువ సంగ్రామ సభ" ఏర్పాట్లలో భాగంగా సభా వేదిక నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, బండారు లక్ష్మారెడ్డి, ముఠా గోపాల్, శంబిపూర్ రాజు, రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు, మాజీ చైర్మన్లు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొని సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సభకు సంబంధించిన వేదిక నిర్మాణం, పార్కింగ్ ఏర్పాట్లు, ప్రజల రాకపోకలు, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలను సమీక్షించి సంబంధిత కమిటీలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న యువ సంగ్రామ సభను విజయవంతం చేసి, నిరుద్యోగ యువత గొంతుకను ప్రభుత్వానికి బలంగా వినిపించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## షార్ట్ సర్క్యూట్ తో అగ్నిప్రమాదం

**- సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే మాదిరెడ్డి సుధీర్ రెడ్డి**





ప్రజాదివాస్
ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధి హస్తినాపురం డివిజన్ పరిధిలోని శ్రీరమణ కాలనీలో ఇండ్ల మధ్యలో ఉన్న ఓ ప్లాస్టిక్ గోదాంలో మంగళవారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్ కారణంగా పెద్ద ఎత్తున అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించడంతో పాటు సంబంధిత అధికారులతో మాట్లాడి సహాయక చర్యలను వేగవంతం చేయాలని సూచించడం జరిగింది. అలాగే గోదాం పక్కన ఉన్న నూతన ఇంట్లో వస్తువులు, ఫర్నిచర్ పూర్తిగా అగ్నికి ఆహుతి కావడం జరిగింది. ఆ ఇంటిని కూడా పరిశీలించారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని తెలిపారు. అలాగే ఇండ్ల మధ్యలో ఇలాంటి గోదాంలు ఉండకుండా కఠినచర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే నివాసాల మధ్యలో గోదాములు ఎర్పాటు చేయకుండా ఉండదానికి స్థానికులు సహకారం అవసరం అని తెలిపారు. ఈ అగ్నిప్రమాదం వల్ల నష్టపోయిన వారికి కలెక్టర్, రెవిన్యూ అధికారులచే మాట్లాడి తగు నష్టపరిహారం ఇప్పించే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ భారాస అధ్యక్షులు ఆందోజు సత్యంచారి, శ్రీనివాస్ నాయక్, గోపిమధు, భీమ్ నాయక్, నాగిరెడ్డి, సాయియాదవ్, బిక్షపతి, విష్ణు, కింగ్ మధు తదితరులు పాల్గొన్నారు.

## తులసివనం అపార్ట్‌మెంట్స్‌లో ఎస్ఐఆర్ ఫారమ్స్ డ్రైవ్

**- కార్యక్రమంలో పాల్గొన్న డీసీసీ కార్యదర్శి శిరీష సత్తూర్**





ప్రజాదివాస్
డివిజన్ నంబర్ 124, బూత్ నంబర్ 540 పరిధిలోని తులసివనం అపార్ట్‌మెంట్స్‌లో ఓటర్ల వివరాల పరిశీలన, ధృవీకరణ మరియు నవీకరణకు సంబంధించి ఎస్ఐఆర్ ఫారమ్స్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి శిరీష సత్తూర్ పాల్గొని, ఎస్ఐఆర్ ప్రక్రియ యొక్క ప్రాముఖ్యతను మరియు ప్రతి అర్హత కలిగిన ఓటరు తమ వివరాలను సరిగ్గా నమోదు చేసుకోవాల్సిన బాధ్యతను నివాసితులకు వివరించారు. ఈ సందర్భంగా శిరీష సత్తూర్ మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రతి పౌరుడి ప్రజాస్వామ్య హక్కు మాత్రమే కాకుండా, ఒక ముఖ్యమైన బాధ్యత కూడా అని అన్నారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు ఎస్ఐఆర్ ఫారమ్‌ను పూర్తి చేసి, ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు.

ప్రజా దివాస్ తెలుగు దినపత్రిక
16-07-2026

# బంగాళాఖాతంలో అల్పపీడనం..

## ఈ ప్రాంతాల్లో ముంబై తరహా కుండపోత వర్షాలే, ఇక అల్లకల్లోలమేనా

ప్రజాదివాస్
బంగాళాఖాతం లో అల్పపీడనం రెడీ అవుతోంది... ఇది రుతుపవనాలను చురుగ్గా మారుస్తుందట. దీంతో తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ లో భారీ నుండి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. నైరుతి రుతుపవనాలు తెలుగు రాష్ట్రాలను తాకి నెలరోజులు కావస్తోంది... అయినా ఇప్పటికీ లోటు వర్షపాతమే కొనసాగుతోంది. జూన్ మొత్తం చెదురుమదురు వర్షాలతోనే సరిపోయింది... భారీ వర్షాల జాడే లేదు. ఇక జూలై ఫస్ట్ హాఫ్ మరీ దారుణం... వానలు కురవకపోగా ఎండలు దంచికొడుతున్నాయి. దీంతో వర్షాలపై భరోసాతో పంటలు పెట్టుకున్న రైతులు వరుణ దేవుడిని కరునించాలని వేడుకుంటున్నారు... వర్షాల కోసం పూజలు చేస్తున్నారు. ఆ దేవుళ్లు రైతుల మొర ఆలకించారో ఏమోగానీ జూలై సెకండాఫ్ లో భారీ నుండి అతిభారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయట. ఈ మేరకు తెలుగు రాష్ట్రాల వాతావరణ విభాగాలు, నిపుణులు చల్లని కబురు అందించారు.కొద్ది రోజులుగా మందగించిన రుతుపవనాలు మళ్లీ యాక్టివ్ గా మారేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నట్లు వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికే బంగాళాఖాతంలో ఓ ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని... ఇది రాబోయే 24 నుండి 48 గంటల్లో బలపడి అల్పపీడనంగా మారనుందని భారత వాతావరణ శాఖ (×వీణ) తెలిపింది. దీని ప్రభావం ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణపై బలంగా ఉంటుందని... ఇవాళ్టి (జూలై 15, బుధవారం) నుండే వర్షాలు మొదలవుతాయట. ఈ వర్షాలు మరింత జోరందుకుని జూలై సెకండాఫ్ (15–31 తేదీల్లో) లో భారీ నుండి అతిభారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.ఇప్పటివరకు ఇటు తెలంగాణ, అటు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల్లో లోటు వర్షపాతమే కొనసాగుతోంది. జూలై సెకండాఫ్ లో కురిసే వర్షాలు ఈ లోటును భర్తీచేసే అవకాశాలున్నాయని వాతావరణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అంటే ఇకపై భారీ నుండి అతిభారీ వర్షాలు కురుస్తాయన్నమాట.ఆంధ్ర ప్రదేశ్ లో కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో... తెలంగాణలో ఉత్తర, తూర్పు జిల్లాల్లో రాబోయే నాలుగైదు రోజుల్లో వర్షాలు ఊపందుకుంటాయని వెల్లడించారు. కొన్నిచోట్ల భారీ నుండి అతిభారీ వర్షాలు, ఒకటిరెండు చోట్ల కుండపోత వర్షాలు ఉంటాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఇలా తెలుగు రాష్ట్రాల్లో కురిసే వర్షాలకు నదులు, వాగులు వంకలు, జలాశయాలు, చెరువులు జలకళను సంతరించుకుంటాయని చెబుతున్నారు.తెలంగాణ వెదర్ మ్యాన్ ప్రకారం... ఇవాళ్టి (జూలై 15) నుండి మెల్లిగా



వర్షాలు షురూ కానున్నాయి. గత నాలుగైదు రోజులుగా తెలంగాణలో పొడి వాతావరణం కొనసాగింది, వేసవి తరహాలో ఎండలు మండిపోతూ అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కానీ ఇకపై వాతావరణం పూర్తిగి మారబోతోందని వెదర్ మ్యాన్ తెలిపారు.ఇవాళ ఉదయం నుండి మధ్యాహ్నం వరకు అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోత కొనసాగినా సాయంత్రం ఒక్కసారిగా ఆకాశాన్ని మేఘాలు కమ్మేసి చిరుజల్లులు కురుస్తాయని తెలంగాణ వెదర్ మ్యాన్ తెలిపారు. ముఖ్యంగా వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మెదక్, నాగర్ కర్నూల్, గద్వాల, నల్గొండ, కొమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో సాయంత్రం నుండి రాత్రివరకు మోస్తరు వర్షాలు కురుస్తాయని వెదర్ మ్యాన్ వెల్లడించారు.

## దివ్యాంగ విద్యార్థులకు సహాయక ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న : ఎమ్మెల్యే జారే



ప్రజాదివాస్
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలోని మున్సిపాలిటీ పరిధిలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్.పి.హెచ్.ఎస్) నందు విద్యాశాఖ – సమగ్ర శిక్ష, తెలంగాణ, అలింకో (ఏఎల్ఐఎంకో) వారి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దివ్యాంగ విద్యార్థులకు సహాయక ఉపకరణాల పంపిణీ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని, నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 5 మండలాల దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 54 మంది దివ్యాంగ విద్యార్థులకు సుమారు 5 లక్షల రూపాయల విలువ గల వినికిడి యంత్రాలు, వీల్ ఛైర్లు, ఇతర అవసరమైన సహాయక ఉపకరణాలను అందజేయడం జరిగింది. విద్యార్థులు తమ వైకల్యాన్ని అధిగమించి, విద్యాభ్యాసంలో ముందడుగు వేయాలనే సత్సంకల్పంతో ప్రభుత్వం ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. ఏ ఒక్క విద్యార్థి కూడా సరైన వసతులు లేక చదువుకు దూరం కాకూడదన్నదే తమ ఉద్దేశమన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని దివ్యాంగ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపడానికి విద్యాశాఖ, సమగ్ర శిక్షా సిబ్బంది, అలింకో సంస్థ చేస్తున్న కృషిని ఎమ్మెల్యే అభినందించారు. ఈ ఉపకరణాలు విద్యార్థుల రోజువారీ పాఠశాల జీవితాన్ని సులభతరం చేసి, వారు సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి దోహదపడతాయని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు మేలు చేకూర్చే ఇలాంటి మరిన్ని వినూత్న సామాజిక కార్యక్రమాలను నియోజకవర్గంలో నిరంతరం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు, జిల్లా నాయకులు తుమ్మ రాంబాబు, మండల అధ్యక్షులు చిన్నంశెట్టిసత్యనారాయణ, దమ్మపేట, అశ్వారావుపేట మండలలా ఎంఈఓ లు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ విజయవంతానికి కౌన్సిలర్లు సహకరించాలి: మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

- పారదర్శకంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియ: వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం
- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ధ్యేయం: చైర్మన్ పుల్కం రాజు
- బీఎల్వోలకు కౌన్సిలర్లు అందుబాటులో ఉండాలి: తహసీల్దార్ జయంత్



ప్రజాదివాస్
వేములవాడ మున్సిపాలిటీ పరిధిలో కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని వంద శాతం విజయవంతం చేసేందుకు స్థానిక వార్డు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పూర్తి స్థాయిలో సహకరించాలని వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు పిలుపునిచ్చారు. బుధవారం వేములవాడ మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మున్సిపల్ కమిషనర్ లోకేష్, తహసీల్దార్ జయంత్ సంయుక్త ఆధ్వర్యంలో కౌన్సిలర్లు, అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలో ఎస్ఐఆర్ కార్యక్రమ అమలు తీరు, ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పురోగతిపై సుదీర్ఘంగా చర్చించి, పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ధ్యేయంగా ఈ ప్రత్యేక కార్యక్రమం సాగుతోందని పేర్కొన్నారు. వార్డుల్లో విధులు నిర్వహిస్తున్న బూత్ స్థాయి అధికారులు (బీఎల్వోలు), బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏలు)కు స్థానిక కౌన్సిలర్లు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ క్షేత్రస్థాయిలో అవసరమైన సహాయ సహకారాలు అందించాలన్నారు. ముఖ్యంగా 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ యువకుడిని ఓటరుగా నమోదు చేయించేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కోరారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోపు ఈ ప్రక్రియ మొత్తాన్ని విజయవంతంగా పూర్తి చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో, బాధ్యతాయుతంగా ముందుకు సాగాలని సూచించారు.మున్సిపల్ కమిషనర్ లోకేష్ మాట్లాడుతూ.. వార్డుల వారీగా ఓటరు నమోదు, సవరణ ప్రక్రియను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ విజయవంతానికి వార్డు అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సాంకేతిక లేదా ఇతర సమస్యలను వెంటనే పైఅధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.అనంతరం తహసీల్దార్ జయంత్ మాట్లాడుతూ.. బీఎల్వోలు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్లకు ఎస్ఐఆర్ కార్యక్రమ విశిష్టతపై పూర్తి అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. ఓటరు జాబితాలో పేర్ల నమోదు, తప్పుల సవరణ, చిరునామాల మార్పుతో పాటు మరణించిన వారి వివరాల తొలగింపు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిశీలన ద్వారానే ఖచ్చితమైన ఓటరు జాబితాను రూపొందించడం సాధ్యమవుతుందన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, స్థానిక కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ మేనేజర్ సంపత్ రెడ్డి, ఎస్ఐఆర్ మాస్టర్ ట్రైనర్ శ్రీధర్, రెవిన్యూ ఇన్స్పెక్టర్లు శ్రీనివాస్, శ్రీధర్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
8

## గజ్వేల్ నియోజకవర్గ బీజేపీ అధ్యక్షుడు కుడిక్యాల రాములుకు సన్మానం



ప్రజాదివాస్
సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ నూతన కార్యవర్గానికి నియోజకవర్గ వ్యాప్తంగా ఘన స్వాగతం లభిస్తోంది. బుధవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన బీజేపీ నియోజకవర్గ పదాధికారులను ప్రముఖ అడ్వకేట్ స్వామి, నాగులపల్లి పవన్ ఘనంగా సన్మానించారు. బీజేపీ నియోజకవర్గ నూతన అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన కుడిక్యాల రాములు, కోశాధికారి ఉప్పల మధుసూదన్, అడ్వైజర్ వెంకట్ రెడ్డిలను వారు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా అడ్వకేట్ స్వామి, నాగులపల్లి పవన్ మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గ బీజేపీ నూతన కార్యవర్గానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నామన్నారు. సమర్థులైన నాయకత్వంలో గజ్వేల్ నియోజకవర్గంలో బీజేపీ మరింత బలోపేతం అవుతుందని ఆశిస్తున్నామన్నారు. నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఈ నూతన కార్యవర్గం ముందుంటుందని నమ్ముతున్నామన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన నాయకులు తమ అనుభవంతో పార్టీని క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని, రాబోయే రోజుల్లో ప్రజాపక్షాన నిలిచి పోరాటాలు చేయాలని వారు ఆకాంక్షించారు.

## సర్ సమీక్ష సమావేశం.

ప్రజాదివాస్



ప్రత్యేక సమగ్ర ఓటర్ సవరణ ప్రక్రియలో భాగంగా జనగామ పట్టణంలో జూబ్లీ గార్డెన్స్ లో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మాజీ ఎమ్మెల్యే కొమ్మూరిప్రతాప్ రెడ్డి నాయకత్వంలో సర్ సమీక్ష సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,వివిధ చైర్మన్లు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,కార్యవర్గ సభ్యులు,వివిధ మండలాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, మహిళా నేతలు,వార్డు కాంగ్రెస్ అధ్యక్షులు,గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,మాజీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు,కార్యకర్తలు,కాంగ్రెస్ పార్టీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు..

## కేసీఆర్‌ది 'ఫాంహౌస్ పాలన': మంత్రి పొంగులేటి

ప్రజాదివాస్
హైదరాబాద్: ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పందించారు. కేసీఆర్ పదేళ్ల పాలనను 'ఫాంహౌస్ పాలన'గా ఆయన అభివర్ణించారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని వినియోగించుకోకుండా ఫాంహౌస్‌కే ఆయన పరిమితమయ్యారని విమర్శించారు.

ప్రభుత్వ వ్యవస్థలను నిర్వీర్యం చేసి పలు రంగాల్లో వైఫల్యాలకు కారణమయ్యారని పొంగులేటి ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లోకి వెళ్లి పాలన అందిస్తోందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రజల కోసం పనిచేసే నాయకత్వంతోనే సుపరిపాలన సాధ్యమవుతుందని పొంగులేటి పేర్కొన్నారు.

# వరుస వాహన దొంగతనాల కేసులను ఛేదించిన చిన్నకోడూరు పోలీసులు

**- నిందితుడు అరెస్ట్, నాలుగు వాహనాలు స్వాధీనం**

ప్రజాదివాస్





చిన్నకోడూరు పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసుకి సంబంధిచి దొంగిలించిన పియాగో ఆపే ఆటో ను చిన్నకోడూరు పోలీసులు ఛేదించినారు దీనితో పాటు గతం లో దొంగతనం చేసిన సిద్దిపేట వన్ టౌన్ కి సంబంధిచిన ఒక పల్సర్ బైక్, హోండా యాక్టివా స్కూటీ, మరియు సిద్దిపేట 2 టౌన్ కి సంబంధిచిన డీుయిుయ జచీ+ ఆటో మొత్తం నాలుగు వాహనాలను స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్ట్ చేసినారు . విశ్వసనీయ సమాచారం మేరకు చిన్నకోడూరు పోలీసులు రాముడిపట్ల గ్రామ సమీపంలో జొన్నల సాయికుమార్ (26 సంవత్సరాలు), తండ్రి బాలచారి, వృత్తి ఆటో డ్రైవర్, నివాసం వెల్దుర్తి గ్రామం, మెదక్ జిల్లాను అదుపులోకి తీసుకొని విచారించగా, అతడు స్వచ్ఛందంగా పలు వాహన దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. విచారణలో నిందితుడు మద్యానికి బానిస కావడం వల్ల తనకు వచ్చే ఆదాయం సరిపోక వాహనాలను దొంగిలించి అమ్మి డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపాడు. ఈ క్రమంలో సిద్ధిపేట పట్టణంలోని వివిధ ప్రాంతాలలో రాత్రి వేళల్లో నిర్లక్ష్యంగా పార్క్ చేసిన వాహనాలను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడినట్లు వెల్లడించాడు.నిందితుడు చూపిన మేరకు మెదక్ జిల్లా వెల్దుర్తి గ్రామంలోని అతని నివాసం వెనుక భాగంలో దాచిపెట్టిన క్రింది వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

1. ఆటో రిక్షా నెం. TS-02-UE-0400
2. స్కూటీ నెం. TS-36-B-8458
3. ఆటో రిక్షా నెం. TG-36-T-4091
4. పల్సర్ మోటార్ సైకిల్ నెం. AP-12-E-6195
5. వాహనాల లాకులు తెరవడానికి ఉపయోగించిన మూడు మాస్టర్ కీలు

నిందితుడు దొంగిలించిన వాహనాలను తన ఇంటి వెనుక భాగంలో ఎవరికి కనిపించకుండా దాచి ఉంచి, అనుకూల సమయంలో విక్రయించాలని యోచించినట్లు విచారణలో వెల్లడైంది.ఇతడి పై గతం లో మూడు కేసు లు నమోదు కావడం జరిగింది .నిందితుడి ఒప్పుకోలు మరియు అతడు చూపించిన ఆధారాల మేరకు పై వాహనాలను స్వాధీనం చేసుకొని, తదుపరి దర్యాప్తు కొనసాగించబడుతోంది.వాహన దొంగతనాల కేసులను ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసి, దొంగిలించిన వాహనాలను స్వాధీనం చేసుకున్న చిన్నకోడూరు పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

# తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ ఆధ్వర్యంలో వర్షాకాల మొక్కల నాటే కార్యక్రమానికి 2,000 మొక్కల విరాళం



ప్రజాదివాస్

తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ వర్షాకాలంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మొక్కల నాటే కార్యక్రమానికి కొడిమ్యాల మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ గడ్డం జీవన్ రెడ్డి గారు ముందుకు వచ్చి 2,000 మొక్కలను అందజేయనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ సభ్యులు సర్పంచ్ గడ్డం జీవన్ రెడ్డి గారిని, ఉపసర్పంచ్ గుర్రం నర్సయ్య గౌడ్ గారిని శ్రీనివాసుని నిత్యకళ్యాణం చిత్రపటాన్ని అందించి ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ గడ్డం జీవన్ రెడ్డి, ఉపసర్పంచ్ గుర్రం నర్సయ్య గౌడ్, తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ వ్యవస్థాపక చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి వూట్కూరి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. వర్షాకాలాన్ని సద్వినియోగం చేసుకుని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.అలాగే, కొడిమ్యాల మండలంలోని ఆలయాలలో ఆలయ దర్శన నియమావళి ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చిన చిలువేరి శ్రీనివాస్ గౌడ్ ని సంస్థ ప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ వ్యవస్థాపక చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి వూట్కూరి, చిలువేరి శ్రీనివాస్ గౌడ్, మొగిలిపాలెం శ్రీనివాస్, అంకం శ్రీనివాస్, నాంపెల్లి శ్రీనివాస్, చెన్న దేవేందర్, బల్ల చిన్న అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు నాట గాంధీజీ గొంతుకైన ... స్వాతంత్రోద్యమ ధీశాలి దుర్గాబాయి

**- వికుర్తి లక్ష్మీనారాయణ ప్రధానోపాధ్యాయుడు**

ప్రజాదివాస్

భారత స్వాతంత్ర్య సమరయోధురాలు, సంఘసంస్కర్త, న్యాయవాది దుర్గాబాయి దేశ్ ముఖ్ 117వ జయంతి సందర్భంగా ప్రాథమిక పాఠశాల న్యూ అర్బన్ కాలనీ, వేములవాడలో దుర్గాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించడం జరిగింది.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు వికుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ " దుర్గాబాయి 1909 జూలై 15న ఆంధ్రప్రదేశ్ లోని రాజమహేంద్రవరంలో జన్మించారని, చిన్నతనంలోనే ఇంగ్లీష్ మాధ్యమాన్ని వ్యతిరేకిస్తూ పాఠశాలను బహిష్కరించారని, గాంధీజీ స్ఫూర్తితో స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని ఉప్పుసత్యా గ్రామంలో చురుగ్గా వ్యవహరించి పలుమార్లు జైలు శిక్ష అనుభవించారని, జైలు జీవితంలోనే ఉన్నత చదువులు పూర్తిచేసి, మద్రాసు హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీసు చేశారని, మహిళల అభ్యున్నతి కోసం 1937 లో 'ఆంధ్ర మహిళా సభ'ను స్థాపించారని, దీని ద్వారా ఎంతోమంది మహిళలకు ఉచిత న్యాయ సహాయం, విద్య మరియు వృత్తి శిక్షణ అందించారని, 1953 లో ఆమె కేంద్ర సాంఘిక సంక్షేమ బోర్డుకు మొదటి అధ్యక్షురాలిగా నియమితులయ్యారని, అక్షరాస్యతకు ఆమె చేసిన కృషికి గాను 1971 లో యూనిస్కో అవార్డు అందుకున్నారని, స్వతంత్ర భారతదేశంలో రాజ్యాంగ పరిషత్ సభ్యురాలుగా ఉంటూ హిందూ కోడ్ బిల్లు రూపకల్పనలో చురుకైన పాత్ర పోషించారని, ప్రణాళికా సంఘం సభ్యురాలిగా కూడా సేవలు అందించారని, దుర్గాబాయి 1953 లో అప్పటి కేంద్ర ఆర్థిక మంత్రి, ఆర్.బి.ఐ మొదటి భారతీయ గవర్నర్ అయిన డాక్టర్ చింతామణి ద్వారకానాథ్ దేశ్ ముఖ్ ను వివాహం చేసుకున్నారని, ఆమె తన ఆత్మకథను' ది స్టోన్ దట్ స్పీకెత్' పేరుతో రచించారని, స్వాతంత్రోద్యమ కార్యక్రమాల్లో భాగంగా తెలుగు



రాష్ట్రానికి వచ్చిన గాంధీజీకి స్వాతంత్ర్య సంగ్రామ నిధిగా తన చేతి బంగారు గాజులను విరాళంగా విద్యార్థి దశలోనే అందించిందని, మరోసారి టికెట్ లేకుండా కాంగ్రెస్ సభలకు హాజరైన నెహ్రూని సైతం అడ్డుకున్న ధీశాలి దుర్గాబాయి" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, దాసరి సుజాత, అంగన్వాడి ఉపాధ్యాయురాలు లిక్కిడి మంజుల, పులి శారద మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# త్వరలోనే కుల సంఘాల భవన నిర్మాణ పనులు ప్రారంభం

**- స్థలాన్ని పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వ విప్**

**- మూడో బ్రిడ్జి నిర్మాణ పనులను, సర్వీస్ రోడ్డు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి లను పరిశీలించిన విప్**

ప్రజాదివాస్

వేములవాడ పట్టణ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మంజూరైన బీసీ భవన్,అంబేద్కర్ భవన్, క్రిస్టియన్ భవన్, ఎస్టీ భవన్,నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు.బుధవారం వేములవాడ పట్టణంలో ఆయా భవనాల నిర్మాణానికి స్థలాలను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు.. నాలుగు భవనాలకు ఒక్కో భవనానికి 1 కోటి 30 లక్షలు మంజూరు



కేటాయించగ టెండర్లు కూడా పూర్తి కావడం జరిగింది.. భవన నిర్మాణాలకు స్థలాన్ని కేటాయించడానికి అవసరమైన ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు విప్ సూచించారు.. సమాజంలోని అన్ని వర్గాలకు ఉపయోగపడేలా నాణ్యమైన సౌకర్యాలతో ఈ భవనాలను నిర్మించనున్నట్లు తెలిపారు.అనంతరం ఫుట్ ఓవర్ బ్రిడ్జి ,తిప్పాపూర్‌లో నిర్మాణంలో ఉన్న మూడో బ్రిడ్జి పనులను విప్ పరిశీలించారు. ప్రస్తుతం పనులు తుది దశకు చేరుకున్నాయని, త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. బ్రిడ్జి అందుబాటులోకి వస్తే పట్టణంలో ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు ప్రజల రాకపోకలు మరింత సులభతరం అవుతాయని చెప్పారు.అదేవిధంగా తిప్పాపూర్ రైతులు తమ వ్యవసాయ క్షేత్రాలకు సులభంగా చేరుకునేందుకు సర్వీస్ రోడ్డు ఎంతో ఉపయోగంగా ఉంటుందని తెలిపారు..వేములవాడ పట్టణ అభివృద్ధితో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి అభివృద్ధి పనిని స్వయంగా పర్యవేక్షిస్తూ త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని విప్ తెలిపారు.

# జ్యోతిష్మతి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ విద్యార్థులకు ఆఫర్లపై చర్యలు తీసుకోవాలి

**- విద్యా వ్యాపారం చేస్తున్న జ్యోతిష్మతి కళాశాల పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి**

**- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్**

ప్రజాదివాస్

కరీంనగర్ జిల్లాలోని జ్యోతిష్మతి ఇంజనీరింగ్ కళాశాలలో 2026-27 విద్యాసంవత్సరం నూతనంగా చేరే బీటెక్ విద్యార్థులకు సంవత్సరానికి 18000, నాలుగు సంవత్సరాలకు 72,000 స్కాలర్షిప్ ఆఫర్లు చెక్ లు ఇస్తూ విద్య వ్యాపారం చేస్తున్నారని వెంటనే జ్యోతిష్మతి కళాశాలపై ఉన్నత విద్యాశాఖ అధికారులుచర్యలు తీసుకోవాలని కోరుతూ ఈరోజు హైదరాబాద్ లోని ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్ణరెడ్డి ీూ×ూఖీ కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో హైదరాబాదులో కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా మచ్చ రమేష్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో కళాశాల వారు జూూూ -జజు ద్వారా 2026-27 సంవత్సరానికి మా కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం ఏ గ్రూపులో అయినా చేరితే మా శాలిని విద్యాసంస్థల ట్రస్ట్ ద్వారా అడ్మిషన్ తీసుకున్నాక వెంటనే పది నిమిషాలలో సంవత్సరానికి 18000 చొప్పున నాలుగు సంవత్సరాలు కలిపి 72,000 ఇవ్వబడును అంటూ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇలా బహిరంగంగా ఆఫర్ల పేరుతో ముందు చెక్కులు ఇచ్చి అడ్మిషన్లు చేపిస్తూ కళాశాల చేరిన తర్వాత ఫీజులో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. ఇలా ఆఫర్లతో విద్యార్థులకు చెక్కులు ఇచ్చే బదులు

ఆ కళాశాలలో ఉన్నత విద్యాశాఖ నిర్ణయించిన ఫీజులను తగ్గించి ఫీజులు వసూలు చేయాలి



కానీ ఇలా ఆఫర్లతో చెక్కులు ఇవ్వడం విద్యా వ్యాపారం చేయడమేనని, అంతేకాకుండా ఇతర లైబ్రరీ, ల్యాబ్, స్కిల్ డెవలప్మెంట్ఇంకా అనేక రకాల ఫీజులతో విద్యార్థులను ఫీజుల దోపిడీ చేసే అవకాశం ఉంది కాబట్టి వెంటనే జ్యోతిష్మతి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రతి విద్యార్థి ఫీజుల వసూళ్లపై విచారణ జరిపించాలని, అడ్మిషన్ ఆఫర్లు ఇస్తున్న పై కళాశాలపై చర్యలు తీసుకోవాలనీ మచ్చ రమేష్ డిమాండ్ చేశారు.

# భూభారతి రీ సర్వే అవగాహన కోసం గ్రామ సభ

ప్రజాదివాస్



సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'భూభారతి' రీ సర్వే కార్యక్రమం అమలు అవుతోందని సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్ బాబు తెలిపారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మేజర్ గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ మల్లు గారి పద్మ అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అయన మాట్లాడారు. శ్రీనివాసపురం రెవెన్యూ శివారు భూముల రీ సర్వే ప్రక్రియలో భాగంగా గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన నూతన భూభారతి చట్టం ద్వారా ప్రతి భూభాగానికి ఖచ్చితమైన సరిహద్దులు నిర్ధారించి వివాదాలకు ముగింపు పలుకుతామని చెప్పారు. అధునాతన సాంకేతికత, డ్రోన్ల సహాయంతో చేపట్టే డిజిటల్ రీ సర్వే ద్వారా భూముల వివరాలు ఖచ్చితంగా నమోదు అవుతాయని, ప్రతి భూమికి జీపీఎస్ ఆధారిత ల్యాండ్ మ్యాప్‌తో పాటు ప్రత్యేక యూనిక్ ఐడీ కేటాయిస్తామని వివరించారు. దీని ద్వారా రైతులకు పారదర్శకతతో పాటు భూ హక్కుల రక్షణ కలుగుతుందని తెలిపారు. ఈ ఆర్డీవో శ్రీధర్ బాబు ల్యాండ్ సర్వేర్ శ్రీనివాస్ తాసిల్దార్ మారుతి రెడ్డి ఇన్స్పెక్టర్ వెంకటాచారి మండల సర్వేయర్ చంద్రమోహన్ కార్యక్రమంలో సర్పంచ్ మల్లు గారి పద్మ నర్సగౌడ్ కార్యదర్శి వార్డు సభ్యులు పాల్గొన్నారు